ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు

TGTEL/25/A1132

మానవాళికి

# జనంవార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..

Q6 NEWS తెలుగు

మేడ్చల్ | గురువారం | 06.08.2026 | సంపుటి : 2 | సంచిక : 35 | పేజీలు : 8 | వెల : 2/- | ఎడిటర్ : గడ్డమీది నాగరాజు

### యువతను శాంతింపజేయడమే
## తొలి కర్తవ్యం కావాలి

భద్రతా బలగాలు అత్యంత సంయమనంతో వ్యవహరించాలి

విద్యార్థుల నిరసనల్లో పోలీసు చర్యపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

02





## హర్మూజ్ తెరవకుంటే అంతే సంగతులు

మరోమారు ఇరాన్‌కు ట్రంప్ ఘాటు హెచ్చరిక

02

## క్యుములోనింబస్ ప్రభావం

- మూడు రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు
- హైదరాబాద్ వాతావరణశాఖ వెల్లడి

క్యుములోనింబస్ మేఘాల వల్ల రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాబోయే మూడు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశమున్నదని వెల్లడించింది. హైదరాబాద్ సహా 18 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ముఖ్యంగా కామారెడ్డి, మేడ్చల్-మలాజిగిరి, మెదక్, సంగారెడ్డి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.



03



### తుమ్మిడిహట్టి పెంపునకు
# ఒప్పించండి
## మహారాష్ట్రను ఒప్పించే బాధ్యత తీసుకోండి

కేంద్రమంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి వినతి

అటవీ పర్యావరణ అనుమతులపై కేంద్రమంత్రి భూపేంద్రయాదవ్‌తో చర్చ

ప్రధాని మోడీని తిడితే కేసు పెట్టామని వెల్లడి

బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఎందుకు పెట్టలేదని ప్రశ్న

**తుమ్మిడిహట్టి ప్రాజెక్టు ఎత్తు పెంపునకు మహారాష్ట్రతో చర్చలకు జోక్యం చేసుకోవాలని కేంద్రమంత్రి సీఆర్ పాటిల్‌ని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి కోరారు. తుమ్మిడిహట్టి నిర్మాణంతో ఎత్తిపోతల ఖర్చు లేకుండా గ్రావిటీతో నీటి సరఫరాకు అవకాశం ఉంటుందని వివరించారు. కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం భేటీ అయ్యారు.**

న్యూఢిల్లీ, ఆగస్ట్ 5 : ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బరాజ్ నిర్మాణం ఎత్తు పెంచడానికి అనుమతించేలా మహా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని కేంద్ర జలవనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. బరాజ్ ఎత్తు పెంపుతో మహారాష్ట్రలో ముంపు ప్రభావం పెద్దగా ఉండదని పేర్కొన్నారు. కాబట్టి కనీసం 150 నుంచి 152 మీటర్ల ఎత్తులో ప్రాజెక్టు నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించాలని కోరారు. ఢిల్లీ పర్యటనకు వచ్చి న సీఎం.. బుధవారం ఉదయం కేంద్ర మంత్రిని ఆయన కార్యాలయంలో కలిశారు. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా ఈ భేటీలో పాల్గొన్నారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాధాన్యత, ఈ ప్రాజెక్టుకు అనుమతుల మంజూరు కోరుతూ ప్రధా నమంత్రి నరేంద్ర మోదీకి తాను రాసిన లేఖ, దానికి పీఎంఓ స్పందించి జల వనరుల శాఖకు లేఖ పంపడం తదితర విషయాల గురించి పాటిల్‌కు ముఖ్య మంత్రి వివరించారు. తుమ్మిడిహెట్టి వద్ద 148 మీటర్ల ఎత్తులో బరాజ్ నిర్మాణానికి గతంలోనే ఉభయ రాష్ట్రాల మధ్య ఒప్పందం కుదిరిన విషయాన్ని

-మిగతా 2 లో..

### సీఎం రేవంత్ రెడ్డి
## విదేశీ పర్యటన

షరతులతో అనుమతిచ్చిన ఏసీబీ కోర్టు

ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు పర్యటించేందుకు అనుమతి

02



### తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులు
# రద్దుచేసే కుట్ర

గోదావరి రివర్ బోర్డు ఎజెండాలో ఏపీకి అనుకూల నిర్ణయాలు

18న జరిగే భేటీ ఉన్నా ఎందుకు నోరు మెదపడం లేదు

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మాజీ మంత్రి హరీష్ రావు

హైదరాబాద్, ఆగస్ట్ 5 : ప్రాజెక్టులకు అన్ని రకాల అనుమతులు లభించిన తర్వాత వాటిని సమీక్షించి రద్దు చేసిన చరిత్ర దేశంలో ఎక్కడా లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత తన్నీరు హరీశ్ రావు వ్యాఖ్యానించారు. కేసీఆర్ హయాంలో సాధించిన తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేసే దిశగా గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు అజెండా రూపొందుతుంటే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దానికి పరోక్షంగా సహకరిస్తున్నారని ఆరోపించారు. ఒక ఉద్యమకారుడిగా ఈ పరిణామాలను చూస్తుంటే తనకు కడుపు రగులుతోందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణకు ఇచ్చిన ప్రాజెక్టులు రద్దు చేయాలనే ధైర్యం ఏపీకి ఎక్కడిదని హరీశ్ రావు ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వంలో 7 ప్రాజెక్టులకు అనుమతులు తెస్తే.. ఆ అనుమతులు రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదిస్తే, జీఆర్ఎంబీ ఎజెండాలో పెట్టాడు.కాళేశ్వరం, సీతారామ లాంటి

మిగతా 2 లో





### క్షుద్ర పూజలపై హరీశ్‌రావు
## వివరణ ఇవ్వాలి

లీగల్ నోటీసులకు తగిన సమయంలో జవాబిస్తా

నిజామబాద్‌లో బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మహేశ్ గౌడ్

### తెలంగాణలో ఇకపై డయల్ 112

పోలీస్,ఫైర్, అంబులెన్స్‌కు ఇక ఒక్కటే నంబర్

సేవలను ప్రారంభించిన డిజిపి సివి ఆనంద్



హైదరాబాద్, ఆగస్ట్ 5 : తెలంగాణలో డయల్ 112 సేవలు అందుబాటగులోకి వచ్చాయి. ఏ ఫిర్యాదుకైనా ఇక 112 ద్వారా సమాధానం వస్తుంది. రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. డయల్ 112 ద్వారా 18 రకాల సేవలు అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. న్యాయసాయం, వైద్యసాయం, సైబర్‌సాయం అనేక సమస్యల

-మిగతా 2 లో..



### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| పారం ధర లైవ్ బర్డ్ | 135 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 162 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 235 (కిలో) |
| స్కిన్ లెస్ | 267 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹74

### హైడ్రా కమిషనర్ రంగనాథ్
## సంతకం ఫోర్జరీ



నో అబ్జెక్షన్ ఫైర్ సర్వీస్ పత్రాలు ఇంటర్ బోర్డుకు సమర్పణ

8 ఇంటర్ కాలేజీలపై చర్యలకు ఆదేశం

హైదరాబాద్, ఆగస్ట్ 5 : హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. దాదాపు ఎనిమిది ప్రైవేటు కాలేజీలు.. రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేశాయి. హైడ్రా పేరును దుర్వినియోగం చేస్తూ నకిలీ ఎన్‌వోసీలను సృష్టించిన కళాశాలలు.. వాటిని ఇంటర్మీడియట్ బోర్డుకు సమర్పించాయి. ఈ విషయం గుర్తించిన అధికారులు దీనిపై విచారణ చేపట్టగా.. హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకం

-మిగతా 2 లో..



02

### 22ఏ భూముల పేరుతో
## ఎవరికీ అన్యాయం చేయం

కొత్తగా ఒక్క సెంటు భూమిని కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదు

ప్రభుత్వ ఆలోచనను అర్థం చేసుకొని అదే స్ఫూర్తితో పనిచేయాలి

అర్హుల హక్కులను కాపాడుతూనే ప్రభుత్వ భూములను పరిరక్షించాలి

22ఏ దరఖాస్తులు, ఫిర్యాదులను నిర్ణీత గడువులోనే పరిష్కరించాలి

జిల్లాల కలెక్టర్లకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టమైన ఆదేశాలు

### కృష్ణానదికి పెరుగుతున్న వరద ప్రవాహం



నారాయణపేట, ఆగస్ట్ 5 : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న ఎడతెరిపి భారీ వర్షాల కారణంగా కృష్ణానది ఉప్పొంగి ప్రవహిస్తోంది. కర్ణాటకలోని రాయచూర్ జిల్లా కృష్ణ నదిపై నిర్మించిన గుర్జాపూర్, యాదగిరి జిల్లా గూడూరు భీమా నదిపై ఉన్న గుగ్గల్ బ్యారేజీకి

-మిగతా 2 లో..

## యువతను శాంతింపజేయడమే
# తొలి కర్తవ్యం కావాలి

- భద్రతా బలగాలు అత్యంత సంయమనంతో వ్యవహరించాలి
- విద్యార్థుల నిరసనల్లో పోలీసు చర్యపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 5 :** నిరసనల సమయంలో భద్రతా బలగాలు, పోలీసులు అత్యంత సంయమనంతో వ్యవహరించాలని సుప్రీంకోర్టు సూచించింది. ఇటీవల సీజేపీ పిలుపునిచ్చిన "చలో పార్లమెం టు" మార్చ్‌లో హింసను ప్రేరేపించిన నిర్వాహ కులపై చర్యలు తీసుకోవాలంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సమయంలో ఈ వ్యాఖ్యలు చేసింది. కొంతమంది తప్పుదారి పట్టినవారు రాళ్లు రువ్వినా.. యువతను శాంతింపజేయడమే తొలి కర్తవ్యం కావాలని తెలిపింది. వారిని బలప్రయోగంతో ఎదుర్కొనే బదులు, మాట్లాడి సమస్యలను తెలుసుకుని కౌన్సెలింగ్ ఇవ్వడమే ఉత్తమ మార్గమని సుప్రీంకోర్టు సీజే జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం సూచించింది. ప్రభుత్వం వైపు నుంచి కూడా దుకుడు ప్రదర్శిస్తే హింస మరింత పెరిగే అవకాశం ఉంటుందని అభిప్రా యపడింది. ఏవైనా అవాంఛనీయ ఘటనలు తలెత్తినప్పుడు పోలీసులు సహనంతో వ్యవహరించి పరిస్థితులు అదుపు తప్పకుండా చూడాల్సి ఉంటుందని సుప్రీంకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. వారు ఎందుకు ఆందోళన వ్యక్తం చేస్తున్నారో, వారి సమస్యలేంటో ముందుగా వినాలని తెలిపింది. వారి సమస్యలను అర్థం చేసుకోవడమే అత్యంత ప్రభావవంతమైన మార్గమని వ్యాఖ్యానించింది. ఇటువంటి పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలో చట్టాన్ని అమలు చేసే సంస్థలకు పూర్తి అవగాహన ఉందని, అది వారి నిర్ణయానికే వదిలివేయడం సముచితమని పేర్కొంది.



# 22ఏ భూముల పేరుతో ఎవరికీ అన్యాయం చేయం

- కొత్తగా ఒక్క సెంటు భూమిని కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదు
- ప్రభుత్వ ఆలోచనను అర్థం చేసుకొని అదే స్ఫూర్తితో పనిచేయాలి
- అర్హులైన వారి హక్కులను కాపాడుతూనే ప్రభుత్వ భూములను పరిరక్షించాలి
- 22ఏ దరఖాస్తులు, ఫిర్యాదులను నిర్ణీత గడువులోనే పరిష్కరించాలి
- జిల్లాల కలెక్టర్లకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టమైన ఆదేశాలు

**హైదరాబాద్,ఆగస్ట్5 :** రాష్ట్రంలో 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూముల విషయంలో ఏ పేదవాడికీ, ఏ నిజమైన భూహక్కుదారుడికీ అన్యాయం జరగకుండా చూడటమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార / పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. అర్హులైన వారి హక్కులను కాపాడటం, అదే సమయంలో ప్రభుత్వ భూములను రక్షించడం అనే రెండు లక్ష్యాలతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్దేశపూర్వకంగా ఒక్క సెంటు భూమిని కూడా 22ఏ నిషేధిత జాబితాలో చేర్చలేదని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేయాలనే ఉద్దేశం ఈ ప్రభుత్వానికి ఎన్నడూ లేదని, వివాదాలు లేని ప్రైవేట్ భూములను నిషేధిత జాబితాలో చేర్చిందన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు. బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలోని తన కార్యాలయంలో క్యూర్ పరిధిలోని 22ఏ నిషేధిత భూములకు సంబంధించి వివిధ మాధ్యమాల్లో వచ్చిన కథనాలు, ప్రజల ఫిర్యాదులు, హైకోర్టు ఆదేశాలు, ప్రభుత్వ విధానాలపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి శేషాద్రి, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, మేడ్చల్ మల్కాజిగిరి అదనపు కలెక్టర్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఈ సమావేశం క్యూర్ పరిధి జిల్లాలకు సంబంధించినదైనా, ఇందులో ఇచ్చిన ఆదేశాలు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ అధికారులు తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు. 22ఏ అంశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి ఆలోచనలు, సూచనలు అనుగుణంగా ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని అధికారులు పూర్తిగా అర్థం చేసుకుని అదే స్ఫూర్తితో పనిచేయాలని ఆదేశించారు. అర్హులైన వ్యక్తికి న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత. అదే సమయంలో ప్రభుత్వ భూములు కాపాడటం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత అని అన్నారు.నిషేధిత జాబితాలో ఉన్న భూములను సమగ్రంగా పరిశీలించి, చట్టబద్ధంగా, నిబంధనల మేరకు అర్హత ఉన్న భూములను గుర్తిస్తూ, ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి కేసును వాస్తవాలు, రికార్డులు, చట్టపరమైన అంశాల ఆధారంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశించారు. 22ఏకు సంబంధించిన దరఖాస్తులు, ఫిర్యాదులు ఏ స్థాయిలో వచ్చినా పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని మంత్రి స్పష్టం చేశారు. తహసీల్దార్, ఆర్డీవో, సబ్ కలెక్టర్, జిల్లా కలెక్టర్ స్థాయిలో వచ్చే ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలించి అర్హులైన వారికి న్యాయం చేయాలని సూచించారు. ÷-రజావాణిలో ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులను కూడా ప్రత్యేక దృష్టి సారించి, వెంటనే విచారణ పూర్తి చేసి విధిగా పరిష్కరించాలని ఆదేశించారు. 22ఏ భూములకు సంబంధించిన వివాదాల పరిష్కారానికి హైకోర్టు నిర్దేశిరచిన 45 రోజుల గడువులోనే అన్ని పక్రియలు పూర్తి చేసి తుది నిర్ణయం తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. 22ఎ కు సంబంధించిన కేసులలో కోర్టు ఆదేశాలను పరిగణనలోకి తీసుకొని పరిష్కరించాలని ప్రజలకు న్యాయం జరిగేలా వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వ భూములను పరిరక్షించడం ప్రభుత్వ ప్రథమ బాధ్యత అని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములపై అక్రమ లావాదేవీలు, అక్రమ రిజిస్ట్రేషన్లు, ఆక్రమణలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. 22ఏ జాబితాలో ఉన్న భూములపై సమగ్ర పరిశీలన చేసి తుది నిర్ణయం తీసుకునే అధికారం జిల్లా కలెక్టర్లకు ఉందని గుర్తుచేస్తూ, ప్రజల హక్కులు ? ప్రభుత్వ ప్రయోజనాలు రెండింటినీ సమతుల్యం చేస్తూ పారదర్శకంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

# తుమ్మిడిహట్టి పెంపునకు ఒప్పించండి

(మొదటిపేజీ తరువాయి)

గుర్తు చేశారు. అయితే 152 మీటర్ల వరకు ఎత్తుతో బరాజ్ నిర్మించే అంశంపై పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ సెంటర్ అధ్యయనం చేసిందని, ఆ అధ్యయనం ప్రకారం152 మీటర్ల ఎత్తులో బరాజ్ నిర్మించినా ముంపులో పెద్దగా తేడా లేదని స్పష్టమైందని చెప్పారు. ఆ ముంపులోనూ 50 శాతం నదీ గర్భంలోనే ఉంటుందని వివరించారు. ఒకవేళ 148 మీటర్ల ఎత్తులో నిర్మిస్తే గ్రావిటీ ద్వారా కావల్సినంత నీరు సరఫరా చేయలేమని అన్నారు. ఈ అంశంపై సాధ్యమైనంత త్వరగా తెలంగాణ, మహారాష్ట్రల మధ్య సమావేశం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. పీఎంఓ నుంచి లేఖ అందిందని ముఖ్యమంత్రికి పాటిల్ చెప్పారు. దీనిపై తొలుత కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి, రాష్ట్రస్థాయి అధికారులతో చర్చల ప్రక్రియ ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఆ తర్వాత ఇరు రాష్ట్రాల నీటి పారుదల శాఖ మంత్రుల సమావేశం ఏర్పాటు చేస్తానని చెప్పారు. ఈ సమావేశంలో ఎంపీలు మల్లు రవి, వేం నరేందర్‌రెడ్డి, రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, ఎం.అనిల్‌కుమార్ యాదవ్, కడియం కావ్య, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాధ్ దాస్, ముఖ్య కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు. పాలమూరు-రంగారెడ్డి, గౌరవెల్లి, సీతమ్మ సాగర్, డిండి ప్రాజెక్టులకు సత్వరమే పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌ను ముఖ్యమంత్రి కోరారు. బుధవారం పార్లమెంట్ భవన్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో పాటు కేంద్రమంత్రిని కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పాలమూరు ప్రాజెక్టుపై రూ.36,437 కోట్లు, డిండి ఎత్తిపోతలపై రూ.3,187 కోట్లు, సీతమ్మ సాగర్‌పై రూ.1,835 కోట్లు, గౌరవెల్లి ప్రాజెక్టుపై రూ.1,350 కోట్ల నిధులను వ్యయం చేసిందని చెప్పారు. అనుమతులు ఇవ్వకపోవడంతో పనులు నిలిచిపోయి, ప్రాజెక్టుల వ్యయం పెరుగుతోందని వివరించారు.



### ప్రధానిని దూషిస్తే బీజేపీ రాష్ట్రాల్లో ఒక్క కేసైనా పెట్టారా?

ప్రదానమంత్రి నరేంద్ర మోదీ, ఆయన దివంగత మాతృమూర్తి హీరాబెన్ మోదీలను సోషల్ మీడియా వేదికగా దూషించిన ఘటనలపై బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కనీసం ఒక్క కేసైనా నమోదు చేశారా? అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణలో తమ ప్రభుత్వం పూర్తిగా చట్ట ప్రకారమే ముందుకు వెళ్తోందన్నారు. సోషల్ మీడియాలో ప్రధానిని, ఆయన తల్లిని దూషిస్తున్నారంటూ హైదరాబాద్‌కు చెందిన బీజేపీ కార్యకర్త చేసిన ఫిర్యాదు నేపథ్యంలో పోలీసులు కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. కాగా కేసు నమోదు చేసిన సైబరాబాద్ పోలీసు అధికారిని బదిలీ చేశారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఈ నేపథ్యంలో బుధవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్‌తో భేటీ తర్వాత సీఎం మీడియాతో పిచ్చాపాటీగా మాట్లాడారు. వచ్చిన ఫిర్యాదు ఆధారంగానే పోలీసులు కేసు నమోదు చేశారని రేవంత్ చెప్పారు. 'ప్రధానిపై, ఆయన తల్లిపై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేసిన కేసుకు సంబంధించి డీఎస్పీ బదిలీ వ్యవహారంపై ఢిల్లీలో పనీపాటా లేని కొందరు విమర్శలు చేస్తున్నారు..'అని పరోక్షంగా కిషన్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు.
అధికారుల బదిలీ అనేది ముఖ్యమంత్రికి రాజ్యాంగం కల్పించిన విచక్షణాధికారమని, తన బాధ్యతల్లో అది కూడా ఒకటని పేర్కొన్నారు. బీజేపీ నేతలే వేరేవాళ్లను దారుణంగా తిడుతున్నారని, కాంగ్రెస్ నేతలను, ప్రతిపక్ష పార్టీల నాయకులను, విద్యార్థులను అభ్యంతరకరమైన పదాలతో దూషిస్తున్నారని మండిపడ్డారు.

## తెలంగాణ ప్రాజెక్టుల
# అనుమతులు రద్దుచేసే కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

7 ప్రాజెక్టులు రద్దు చేయండి.. తెలంగాణ నోటికాడ ముక్క లాక్కొండని ప్రతిపాదించారు. దీన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలన్నారు. ఈనెల 18న జరగనున్న గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు సమావేశం అజెండాపై హరీశ్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ ప్రాజెక్టులకు వచ్చిన అనుమతులను సమీక్షించాలని జీఆర్ఎంబి సమావేశ అజెండాలో చేర్చారని ఆరోపించారు. అజెండా వచ్చి వారం రోజులు గడిచినా ఎవరూ మాట్లాడటం లేదని విమర్శించారు. ఏడు ప్రాజెక్టులకు వచ్చిన అనుమతులు రద్దు చేయాలని ఏపీ ప్రభుత్వం అడిగితే అజెండాలో ఎలా చేరుస్తారని ప్రశ్నించారు. ఏపీ కోసమే అజెండా ఉన్నట్లు కనిపిస్తోందని ఆరోపణలు గుప్పించారు. తెలంగాణ ప్రాజెక్టులను వ్యతిరేకించడం లేదని ఏపీ ముఖ్యమంత్రి చెబుతున్నారని, కానీ ఇటీవల తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకోవాలని కేంద్రానికి ఏపీ ప్రభుత్వం లేఖ రాసిందని హరీశ్ తెలిపారు. తెలంగాణ నీటి ప్రయోజనాలను ఏపీకి తాకట్టు పెడుతున్నారా అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జీఆర్ఎంబీలో రెండు రాష్ట్రాలుంటాయి. కేంద్రప్రభుత్వం చైర్మన్‌గా ఉంటే.. ఓవైపు తెలంగాణ ఇంజనీర్లు, మరోవైపు ఏపీ ఇంజనీర్లు ఉంటారు.. జీఆర్ఎంబీలో ఈ ఎజెండా తయారవుతుంటే తెలంగాణ ఇంజనీర్లు ఏం చేస్తున్నారని హరీశ్ రావు ప్రశ్నించారు. ఒకవేళ తెలంగాణ ఇంజనీర్లు రేవంత్ రెడ్డికి చెప్పినా ఆయన పట్టించుకోలేదా..? అసలు ఈ ఎజెండా ఎట్లా వచ్చింది. ఇచ్చిన ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేయాలని అడిగే ధైర్యం ఆంధ్రప్రదేశ్‌కు ఎక్కడిది. ఇది ఎజెండాలో పెట్టే జీఆర్ఎంబీకి ఎక్కడిది..? అని హరీశ్ రావు ప్రశ్నించారు. తెలంగాణ అంటే ఎట్లా కనబడుతుంది మీకు. త్యాగాల పునాదుల మీద, పోరాటాల మీద సాధించుకున్న ఈ తెలంగాణ నీళ్ల కోసం జరిగిన ఈ ఉద్యమంలో కేసీఆర్ కష్టపడి 383 టీఎంసీల గోదావరి జలాలను మేం అనుమతులు తెచ్చినమన్నారు. తెచ్చిన అనుమతులు రద్దయితయా..? అని హరీశ్ రావు అడిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 3 ఏండ్లలో ఒక్క ప్రాజెక్టుకు కూడా అనుమతి తేలేదు.. ఒక్క టీఎంసీకి కూడా మీకు క్లియరెన్స్‌లు తేలేదు. మీరొచ్చిన తర్వాత డీపీఆర్‌లు రిటర్న్ వచ్చినయి. సమ్మక్క బ్యారేజ్, పాలమూరు ఎత్తిపోతల పథకం డీపీఆర్ రిటర్న్ వచ్చింది. వార్దా డీపీఆర్ రిటర్న్ వచ్చింది ఒక్కో ప్రాజెక్టు వాపసు వస్తున్నాయి. పైగా బీఆర్ఎస్ తెచ్చిన అనుమతులు రద్దు చేయాలనే ఎజెండా వచ్చింది. ఎంత చేతకాని దద్దమ్మ ప్రభుత్వం ఇదని హరీశ్ రావు మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2022 ఆగస్టు 25న ఎంతో కష్టపడి సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు అనుమతులు సాధించిందని హరీశ్ రావు గుర్తుచేశారు. అయితే ఇప్పుడు ఆ సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు ఉరి వేసేందుకు పెద్ద ఎత్తున కుట్ర జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కర్ణాటకలో ముగ్గురు ముఖ్యమంత్రుల భేటీ సందర్భంగా 47 టీఎంసీల సమ్మక్క సాగర్ ప్రాజెక్టును వదులుకోవాలని ఆంధ ప్రదేశ్ కోరగా, తెలంగాణ ప్రభుత్వం దానికి అంగీకరించిందన్నారు. సమ్మక్క సాగర్ ప్రాజెక్టు నీళ్లు వాస్తవానికి ప్రస్తుత ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సొంత నియోజకవర్గమైన హుజూర్‌నగర్‌కు వెళ్తాయని, అయినా కూడా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. తాము ఈ అంశాన్ని లేవనెత్తిన రెండు రోజులకే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్రానికి లేఖ రాయడం వారి దివాలాకోరుతనానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రాజెక్టులకు సంబంధించిన ఏడు అనుమతులను రివ్యూ చేస్తామని కేంద్రం చెబుతున్నప్పటికీ బీజేపీ నేతలు ఏమాత్రం స్పందించకపోవడాన్ని హరీశ్‌రావు తప్పుబట్టారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి భయపడి కేంద్ర మంత్రులు పెదవులు మూసుకుంటున్నారని, దీనిపై బీజేపీ వెంటనే స్పందించకపోతే తెలంగాణ ప్రయోజనాల కోసం మరో ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. తెలంగాణలో ప్రస్తుతం చంద్రబాబు బంటు ముఖ్యమంత్రిగా ఉన్నారు కాబట్టే జీఆర్ఎంబీ అజెండాలో ఇలాంటి ప్రతిపాదనలు వస్తున్నాయని, ఒకవేళ కేసీఆర్ సీఎంగా ఉంటే ఆంధ్రప్రదేశ్ లేదా కేంద్రానికి ఇంత ధైర్యం వచ్చేదా అని ప్రశ్నించారు. ఏపీ మూలాలు ఉన్న అధికారులు తెలంగాణ ఇరిగేషన్ శాఖలో బాధ్యతలు వహిస్తుండటం వల్లే ఇలా జరుగుతోందని ఆరోపించారు. జీఆర్ఎంబీ సమావేశ అజెండా నుంచి గోదావరి, బనకచర్ల అంశాలను తొలగించాలని, ఈ అజెండాను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై పార్లమెంట్‌లో ఉన్న కాంగ్రెస్ ఎంపీలు గళం విప్పాలని కోరారు. ఇరిగేషన్ విషయంలో ప్రభుత్వం రిట్, సూట్ పిటిషన్ల పేరుతో ఏడాది కాలంగా సమయం వృథా చేసిందని విమర్శించారు. రేవంత్ రెడ్డి లోపాయికారీ ఒప్పందాలతో గోదావరి, బనకచర్ల ప్రాజెక్టులకు ఒప్పుకున్నారని ఆరోపించారు. గోదావరి జలాల్లో తెలంగాణకు చట్టబద్ధంగా 960 టీఎంసీల నీటి కేటాయింపులు ఉన్నప్పటికీ, రాష్ట్ర హక్కులు కాలరాస్తుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చూస్తూ బొమ్మలాగా కూర్చున్నారని హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు ఒక్క ప్రాజెక్టుకు కూడా అనుమతులు తీసుకురాలేదని హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. తెలంగాణకు తాగు, సాగునీరు దూరం చేసే కుట్ర జరుగుతోందని హరీశ్ ఆరోపించారు. రాష్ట్రానికి ద్రోహం జరుగుతుంటే ముఖ్యమంత్రి రేవంత్ ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. గురు దక్షిణ చెల్లించడం కోసం రేవంత్ మౌనంగా ఉన్నారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో చేతగాని ప్రభుత్వం ఉందని విమర్శించారు. నీటి విషయంలో అన్యాయం జరిగితే తెలంగాణ ఊరుకోదని హెచ్చరించారు. కాళేశ్వరం అనుమతులు రద్దు చేయడమంటే సగం తెలంగాణకు అన్యాయం చేయడమే అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పాలనలో కృష్ణా జలాలను కూడా సరిగా వాడటం లేదని మాజీ మంత్రి విమర్శించారు.

# క్షుద్ర పూజలపై హరీష్ వివరణ ఇవ్వాలి

**నిజామాబాద్, ఆగస్ట్ 5 :** తమిళనాడు, కర్ణాటకల్లో చేసిన పూజలపై మాజీ మంత్రి హరీశ్‌రావు స్పష్టత ఇవ్వాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. పూజల వివరాలను మీడియాకు వెల్లడించకుండా ఎందుకు గోప్యంగా ఉంచారని ప్రశ్నించారు. తమవద్ద హరీస్ పూజలపై ఆధారాలు ఉన్నాయని అన్నారు. నిజామాబాద్‌లో టీఎన్జీవో ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల వేడుకలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడారు. 'పక్క రాష్ట్రాల్లో చేసిన పూజలపై హరీశ్‌రావు స్పష్టత ఇవ్వాలన్నారు. రాష్ట్రానికి మంచి జరగాలని కోరుకోకుండా క్షుద్ర పూజలు చేయడం శ్రేయస్కరం కాదు. నాకు ఇచ్చిన లీగల్ నోటీసులపై సరైన సమయంలో సమాధానం చెబుతా నని, దీనికి భయపడే ప్రసక్తి లేదన్నారు. రాష్ట్రాభివృద్ధి దృష్ట్యానే దీనిపై మాట్లాడుతున్నాం. నాకు ఎవరిపైనా వ్యక్తిగత కక్ష లేదని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. నిజామాబాద్ నగరంలో మంగళవారం సాయంత్రం ఆరె కటిక సంఘం ఆధ్వర్యంలోని బోనాలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి రాష్ట్ర ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని మొక్కుకున్నారు. తెలంగాణ సంస్కృతీసంప్రదాయాలకు బోనాల పండగ ప్రతీక అన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యానారాయణ, మేయర్ ఉమారాణి, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, డీసీసీ ప్రెసిడెంట్‌నగేశ్ రెడ్డి, నుడా చైర్మన్ కేశవేణు, శేఖర్ గౌడ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సిఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన

### శరతులతో అనుమతిచ్చిన ఏసీబీ కోర్టు

**ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు పర్యటించేందుకు అనుమతి**

**హైదరాబాద్,ఆగస్ట్5 :** సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు ఏసీబీ ప్రత్యేక కోర్టు షరతులతో కూడిన అనుమతి ఇచ్చింది. ఓటుకు నోటు కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రేవంత్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం, ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు యూకే, అమెరికా, జర్మనీ, చైనా దేశాల్లో పర్యటించేందుకు అనుమతించింది. ఇందుకోసం కోర్టు కస్టడీలో ఉన్న ఆయన పాస్‌పోర్టులను తాత్కాలికంగా విడుదల చేయాలని ఆదేశించింది. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించే లక్ష్యంతో విదేశీ పర్యటన చేపడుతున్నట్లు రేవంత్ రెడ్డి తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. పాస్‌పోర్టులను తాత్కాలిక కస్టడీకి ఇవ్వడంతో పాటు విదేశీ ప్రయాణానికి అనుమతి ఇవ్వాలని కోరారు. దీనిపై విచారణ జరిపిన ఏసీబీ కోర్టు పిటిషన్‌ను పాక్షికంగా అనుమతించింది. విదేశీ పర్యటనకు అనుమతి ఇస్తూనే కోర్టు పలు షరతులు విధించింది. లక్ష వ్యక్తిగత బాండ్‌తో పాటు ఒక ష్యూరిటీ సమర్పించాలని ఆదేశించింది. విదేశీ పర్యటనకు సంబంధించిన పూర్తి ప్రయాణ వివరాలు, అక్కడ బస చేసే చిరునామాలు, సంప్రదింపు ఫోన్ నంబర్లు కోర్టుకు అందజేయాలని పేర్కొంది. అలాగే, సెప్టెంబర్ 18లోగా పాస్‌పోర్టులను తిరిగి కోర్టులో జమ చేస్తానని అఫిడవిట్ దాఖలు చేయాలని రేవంత్ రెడ్డిని ఆదేశించింది. ఆ అఫిడవిట్ సమర్పించిన అనంతరం ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారికి లేఖ రాసి పాస్‌పోర్టులను తాత్కాలికంగా అప్పగించాలని కోర్టు ఆదేశాల్లో పేర్కొంది.




## హైడ్రా కమిషనర్ రంగనాథ్
# సంతకం ఫోర్జరీ

(మొదటిపేజీ తరువాయి)

ఫోర్జరీ చేసినట్లు నిర్ధారించారు. దీంతో నకిలీ పత్రాలు సమర్పించిన ఎనిమిది ప్రైవేట్ కళాశాలల గుర్తింపును రద్దు చేయాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే ఈ ఘటనపై లేక్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. ఫోర్జరీ, నకిలీ పత్రాల సృష్టి తదితర కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హైడ్రా పేరుతో నకిలీ ఫైర్ నో అ÷-జబెక్షన్ సర్టిఫికెట్లు సృష్టించి ఇంటర్మీడియట్ బోర్డుకు సమర్పించిన వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు గుర్తించిన అధికారులు 8 ప్రైవేటు జూనియర్ కాలేజీలపై కేసు నమోదు చేశారు. ఈ పత్రాల ఆధారంగా గుర్తింపు పొందేందుకు ప్రయత్నించినట్లు వెల్లడైంది. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు ఫిర్యాదు చేయడంతో లేక్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దర్యాప్తులో తెల్లాపూర్, చిక్కడపల్లి, ఎస్ఆర్ నగర్, మెహిదీపట్నం, బర్కత్‌పురా ప్రాంతంలోని 8 ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలు ఈ ఫోర్జరీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఆయా కాలేజీ గుర్తింపును రద్దు చేయాలని ఇంటర్మీడియట్ బోర్డుకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. ఇదే తరహాలో సమర్పించిన మరో 60 ప్రైవేటు కాలేజీ ఫైర్ ఎన్‌ఓసీలను కూడా అధికారులు స్క్రూటినీ చేస్తున్నారు. వాటి ప్రామాణికతపై విచారణ కొనసాగుతోందని, దర్యాప్తులో మరిన్ని అక్రమాలకు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

## కృష్ణానదికి పెరుగుతున్న వరద ప్రవాహం

(మొదటిపేజీ తరువాయి)

వరద నీరు పోటెత్తడంతో ఈ బ్యారేజీ 40 గేట్లను ఎత్తి దిగువకు నీటి విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి భారీగా వస్తున్న వరద జలాలు తెలంగాణలోని జోగులాంబ గద్వాల జిల్లా జూరాల ప్రాజెక్టు కు చేరుతుండటంతో నది పరివాహక ప్రాంతం జలకళను సంతరించుకుంది. నది పూర్తిగా నీటితో నిండిపోవడంతో తెలంగాణ-కర్ణాటక సరిహద్దులోని కృష్ణ బ్రిడ్జి కింద ప్రవహిస్తున్న వరద ప్రవాహం ఆహ్లాదకర దృశ్యాన్ని తలపిస్తోంది. ఈ దృశ్యాన్ని చూసేందుకు స్థానికులతో పాటు ప్రయాణికులు కూడా బ్రిడ్జి వద్దకు చేరుకుని ఫొటోలు, వీడియోలు తీసుకుంటున్నారు. కృష్ణానదిలో ప్రవాహం రోజురోజుకు వరద ప్రవాహం పెరుగుతుందడడంతో జూరాల ప్రాజెక్టు అధికారులు ఎప్పటి కప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ఇదిలా ఉండగా, వరద ఉధృతి కారణంగా నదిలో స్నానాలు చేయకుండా, చేపల వేటకు వెళ్లకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.



# క్యుములోనింబస్ ప్రభావం

- మూడు రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు
- హైదరాబాద్ వాతావరణశాఖ వెల్లడి

**హైదరాబాద్, ఆగస్ట్ 5 :** క్యుములోనింబస్ మేఘాల వల్ల రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాబోయే మూడు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశమున్నదని వెల్లడించింది. హైదరాబాద్ సహ 18 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ముఖ్యంగా కామారెడ్డి, మేడ్చల్-మలాజిగిరి, మెదక్, సంగారెడ్డి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వెల్లడించింది. హైదరాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, కుమ్రం భీం ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, ములుగు, నల్లగొండ, నారాయణపేట, నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, వికారాబాద్, వరంగల్, యాదాద్రి భువనగిరి జిల్లాలకు ఎల్లోఅలర్ట్ జారీ అయ్యింది. ఈ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురువొచ్చు. కాగా, గడిచిన 24 గంటల్లో 4 మండలాల్లో 11.56 సెం.మీ నుంచి 20.44 సెం.మీ మధ్య వర్షపాతం నమోదైంది. 6.45 సెం.మీ నుంచి 11.55 సెం.మీ మధ్య 40 మండలాల్లో, 1.56 సెం.మీ నుంచి 6.44 సెం.మీ మధ్య 281 మండలాల్లో వర్షపాతం నమోదైనట్టు వాతావరణ కేంద్రం తెలిపింది. అత్యధికంగా కామారెడ్డి జిల్లా పిట్లంలో 14.11 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు పేర్కొంది.

## తెలంగాణ రైజింగ్-2026 గ్లోబల్ సమ్మిట్‌కు

# విస్తృత ఏర్పాట్లు చేయాలి

- సమన్వయంతో కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలి
- భారీ పెట్టుబడుల ఆకర్షణకు గ్లోబల్ సమ్మిట్ వేదికగా నిలవాలి
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



**హైదరాబాద్, ఆగస్ట్ 5 :** డిసెంబర్‌లో నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్-2026' గ్లోబల్ సమ్మిట్ విజయవంతం అయ్యేలా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో సి.ఎస్ మాట్లాడుతూ, తెలంగాణ రైజింగ్?2047 లక్ష్య సాధనలో భాగంగా రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు జాతీయ, అంతర్జాతీయ సంస్థల సహకారం అత్యంత అవసరమని అన్నారు. రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ) వృద్ధికి గ్లోబల్ సమ్మిట్ కీలక వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ÷లంగాణను అభివృద్ధి, పెట్టుబడులు, పారిశ్రామిక వృద్ధి, మౌలిక సదుపాయాలు, నైపుణ్యాభివృద్ధి, ఆవిష్కరణలు, ఉపాధి కల్పన, సంక్షేమం వంటి అన్ని రంగాల్లో దేశంలోనే అగ్రస్థానంలో నిలపాలనే లక్ష్యంతో ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్' కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ భవన సముదాయాలను వినియోగించుకోవాలని సూచించారు. అలాగే రహదారులు, విద్యుత్, తాగునీటి సరఫరా తదితర మౌలిక సదుపాయాలను సకాలంలో సిద్ధం చేయాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. పెట్టుబడులను ఆకర్షించడం, పారిశ్రామిక అభివృద్ధిని మరింత వేగవంతం చేయడం, యువతకు నైపుణ్యాభివృద్ధి అవకాశాలను విస్తరించడం, ఉపాధి కల్పనను పెంపొందించడం, డిజిటల్ సేవలను మరింత సమర్థవంతంగా అందించడం వంటి అంశాలపై సమావేశంలో అధికారులు విస్తృతంగా చర్చించారు. సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్-అఫీషి యో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, టీజీఐఐసీ ఎండీ శశాంక, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ అజిత్ రెడ్డి, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి తదితరులు పాల్గొన్నారు.



# విద్యారంగంపై ప్రభుత్వం నిర్లక్ష్యం

- బడ్జెట్ కేటాయింపులే నిదర్శనం
- బిఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశిపతి శ్రీనివాస్

**హైదరాబాద్, ఆగస్ట్ 5 :** తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి అత్యంత తక్కువ నిధులు కేటాయించి కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ ఆరోపించారు. 2024-25 బడ్జెట్‌లో మొత్తం వ్యయంలో విద్యారంగానికి కేవలం 5.98 శాతం మాత్రమే కేటాయించడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని ఆయన దుయ్యబట్టారు. గత 6-7 ఏళ్ల తెలంగాణ బడ్జెట్‌లను పరిశీలిస్తే విద్యారంగానికి ఇంత తక్కువ శాతం నిధులు కేటాయించడం ఇదే తొలిసారని దేశపతి శ్రీనివాస్ పేర్కొన్నారు. విజ్ఞాన గనిగా మారాల్సిన తెలంగాణను కాంగ్రెస్ ప్రభుత్వం అంధకారంలోకి నెట్టాలని చూస్తోందని ఆరోపించారు. విద్యాశాఖను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన వద్దే ఉంచుకున్నప్పటికీ, ఆ శాఖకు తగిన నిధులు కేటాయించడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తారని భావిస్తే, బ్జడెట్‌లో కేవలం 5.98 శాతానికే పరిమితం చేయడం దురదృష్టకరమని అన్నారు. నిధుల కొరత కారణంగా ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, విశ్వవిద్యాలయాలు మౌలిక వసతుల సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని దేశపతి శ్రీనివాస్ తెలిపారు. దీంతో విద్యార్థుల భవిష్యత్తు, రాష్ట్ర విద్యా వ్యవస్థ పునాదులు దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ సమాజం విద్యావంతం కావడం, పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇష్టం లేదా అని ఆయన ప్రశ్నించారు. తక్షణమే విద్యారంగానికి కేటాయింపు లను వెంటనే పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యం కొనసాగిస్తే విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# ఆర్ఎస్ ప్రవీణ్ టిష్యూ పేపర్

- రాహుల్ గురించి మాట్లాడే అర్హత లేదు
- ఏఐసీసీ సెక్రెటరీ సంపత్ కుమార్

**హైదరాబాద్, ఆగస్ట్ 5 :** బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై ఏఐసీసీ సెక్రెటరీ సంపత్ కుమార్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ డస్ట్ బిన్‌లో ఆర్ఎస్ ప్రవీణ్ టిష్యూ పేపర్ అంటూ వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ గురించి మాట్లాడే అర్హత ప్రవీణ్‌కు ఎక్కడిదని ప్రశ్నించారు. కేసీఆర్ కాళ్లు మొక్కి ఒకే పోస్టులో ఏడు సంవత్సరాలు ఉన్నారని ఆరోపించారు. ప్రవీణ్ కుమార్ జాతి ద్రోహి అని.. బీఎస్పీ పార్టీని కేసీఆర్ కాళ్ల దగ్గర పెట్టారని విమర్శించారు. ఐపీఎస్‌గా చేసిన వారు కూడా ఇలా ప్రవర్తించడం దారుణమని సంపత్ అన్నారు. కల్వకుంట్ల కుటుంబ మాయమాటల మత్తులో ఆర్ఎస్ ప్రవీణ్ ఉన్నారని... ఆ కుటుంబానికి ఊడిగం చేస్తున్నారని దుయ్యబట్టారు. లీగల్ నోటీసులు ఎప్పుడు పంపుతారో హరీశ్ రావుకు తెలియదా?.. అడ్వకేట్ ఉన్నారు కదా అని నోటీసులు పంపిస్తే ఎలా అని ప్రశ్నించారు. క్షుద్రపూజల ఆరోపణలపై హరీశ్ సమాధానం చెప్పాలని.. సమాధానం చెప్పకుండా నోటీసులు పంపడం విడ్డూరమని సంపత్ కుమార్ వ్యాఖ్యానించారు.

# విద్య కేవలం ఉద్యోగం కోసమే కాదు

**మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు**



**విజయవాడ,ఆగస్ట్5 :** విద్య అనేది కేవలం ఉద్యోగం పొందడానికి మాత్రమే కాకుండా, వ్యక్తిత్వ వికాసానికి, దేశ నిర్మాణానికి దోహదపడాలని భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. అమరావతిలోని అమృత యూనివర్సిటీ స్నాతకోత్సవ కార్యక్రమంలో మంత్రి లోకేష్‌తో పాటు వెంకయ్య నాయుడు కూడా పాల్గొన్నారు. పట్టభద్రులకు శుభాకాంక్షలు తెలియజేశారు. 'విదేశాల్లో చదువుకున్నా మనదేశానికి వచ్చి సేవ చేయండి. చదువు సంస్కారం నేర్పాలి. సూర్యోదయం నుంచి సూర్యాస్తమయంలోపు మీ పనులు పూర్తి చేసుకోండి. తల్లిదండ్రులతో కలిసి సమయం గడపండి. కుటుంబ వ్యవస్థకు మూలం భారత్. ప్రపంచంలో భారత్ శక్తి వంతమైన దేశం. భారత్ విశ్వ గురువు. గతంలో ప్రపంచంలోని పలు దేశాల విద్యార్థులు మన దేశంలోని నలందా, తక్షశిల లాంటి యూనివర్సిటీల్లో చదువుకున్నారు' అని వెంకయ్య పేర్కొన్నారు. నేను స్కూల్ నుంచే విద్యార్థి నాయకుడిగా పని చేశా. ఎమర్జెన్సీ టైమ్‌లో 17 నెలలు పాటు జైల్లో ఉన్నా. 1983లో ఎమ్మెల్యేగా గెలిచా. రాజకీయాల్లో ఉండగా నా జేబు నుంచి ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదు. నా నలభై ఏళ్ల రాజకీయ జీవితంలో 30 ఏళ్లు ప్రతిపక్షంలోనే ఉన్నా. నేను ఒకప్పుడు వాజపేయి పేరు గోడ మీద రాశాను. అదే వాజపేయితో బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఒకే వేదికపై కూర్చున్నా' అని వెంకయ్య గుర్తు చేసుకున్నారు. అంతకు ముందు మంత్రి నారాలోకేష్ కూడా మాట్లాడారు. భవిష్యత్ అవకాశాలను అందుపుచ్చుకునేలా విద్యారంగంలో సమూల మార్పులు రావాలని లోకేష్ ఆకాంక్షించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఆంధ్రప్రదేశ్‌లో విస్తృతమైన ఎకోసిస్టమ్ నిర్మాణం జరుగుతోందన్నారు. వైఫల్యాలను చూసి భయపడొద్దని, ఆత్మవిశ్వాసంతో యువత ముందుకు సాగాలని సూచించారు. జీవితంలో ఉన్నత స్థానానికి చేరాలంటే కఠినమైన మార్గాన్ని మాత్రమే ఎంచుకోవాలని అన్నారు.

# పూర్తికావచ్చిన సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి

**తుదిదశకు మూసారాం బాగ్ బ్రిడ్జి పనులు**

**పనులను పర్యవేక్షించిన మంత్రులు**

**హైదరాబాద్, ఆగస్ట్ 5 :** హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులలో భాగమైన సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయ్యాయని హైదరాబాద్ ఇన్-ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మంత్రి అజారుద్దీన్‌తో కలిసి నూతనంగా రూపుదిద్దుకున్న సైదాబాద్ స్టీల్ బ్రిడ్జితో పాటు తుది దశకు చేరుకున్న మూసారాంబాగ్ బ్రిడ్జి పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాలా, కాలేరు వెంకటేష్, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తదితర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సుమారు రూ.680 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ఆధునిక స్టీల్ బ్రిడ్జి చంచల్‌గూడ జైలు ప్రాంగణం నుంచి ఓవైసీ ఆస్పత్రి వరకు, అలాగే మరోవైపు చంపాపేట వైపు సులభంగా వెళ్లేలా మెరుగైన కనెక్టివిటీని అందిస్తుంది. అతిత్వరలోనే ఈ వంతెనను రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించి ప్రజలకు అంకితం చేయనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే సైదాబాద్, సంతోష్‌నగర్, చంచల్‌గూడ, చంపాపేట తదితర ప్రాంతాల ప్రజలకు సుదీర్ఘకాలంగా వేధిస్తున్న ట్రాఫిక్ కష్టాల నుంచి ఉపశమనం లభించడమే కాకుండా ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుంది. అలాగే మూసారాంబాగ్ వద్ద నిర్మిస్తున్న వంతెన పనులు సైతం చివరి ఘట్టానికి చేరుకున్నాయని, రాకపోకలకు వీలుగా అప్రోచ్ రోడ్ల విస్తరణను వేగవంతం చేశామని తెలిపారు. నగరంలో నానాటికీ పెరుగుతున్న జనాభా, వాహనాల రద్దీకి అనుగుణంగా కేబీఆర్ పార్క్ పరిసరాల్లో చేపట్టిన బ్రిడ్జి పనులతో పాటు పెండింగ్ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారని, ప్రజా రవాణాను మరింత మెరుగుపరచడమే ప్రభుత్వ ప్రాధాన్యమని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.



# 15 ఏళ్ల బాలికతో బలవంతంగా క్షమాపణలు

- నిరసనకారుల ఇళ్లపైకి గూండాలను పంపారు
- మీడియా సమావేశంలో రాహుల్ ఆరోపణలు

**న్యూఢిల్లీ,ఆగస్ట్5 :** నీట్ పేపర్ లీక్ వివాదంపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద యువత నిరసనలు తెలిపారు. అయితే, విద్యార్థుల్ని బలప్రయోగం, బెదిరింపులతో కేంద్రం అణచివేసిందని లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఆరోపించారు. నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులతో కలిసి ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. విద్యార్థుల ఇళ్లకు గుండాలను పంపించారని, 15 ఏళ్ల బాలికతో బలవంతంగా క్షమాపణలు చెప్పించారని రాహుల్ గాంధీ ఆరోపించారు. నిరసనకారులు రాజ్యాంగ పరిరక్షకులని, కూప్పకూలుతున్న పనికిరాని విద్యా వ్యవస్థను ప్రశ్నిచడంలో ఎలాంటి తప్పు లేదని అన్నారు. నిరసనల్లో పాల్గొన్న వారి ఇళ్లకు గుండాలను పంపించారని, ఆ తర్వాత 15 ఏళ్ల బాలికతో బలవంతంగా క్షమాపణలు చెప్పించి, ఆ క్షమాపణలు అంగీకరించారని, ఇది పూర్తిగా అర్థరహితం, దీనిని తాము అంగీకరించమని రాహుల్ గాంధీ అన్నారు. విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేశారని, వారిని వేధించారని ఆరోపించారు. దేశంలో పారదర్శకంగా పనిచేసే విద్యా వ్యవస్థ అవసరమని అన్నారు. విద్యార్థులు ఎలాంటి హింసకు పాల్పడలేదని, వారిపై లాఠీచార్జ్ చేయడం, వేధించడం సరికాదని అన్నారు. తమ భవిష్యత్తు కోసం పోరాడుతున్న విద్యార్థులపై గర్వంగా ఉందని పేర్కొన్నారు.

# జార్ఖండ్ నిరుద్యోగులకు సిజెపి మద్దతు

- దేశంలో ప్రెజర్ గ్రూపుగా పనిచేస్తాం
- రాజకీయ పార్టీగా మారే ఆలోచన లేదు
- సిజెపి నేత అభిజిత్ దీప్కే స్పష్టీకరణ

**ముంబై, ఆగస్ట్ 5 :** జార్ఖండ్ ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలు జరిగాయంటూ నిరసనలు తెలుపుతున్న అభ్యర్థులకు కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) మద్దతు ప్రకటించింది. అవసరమైతే రాంచీకి వెళ్లి ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొంటామని సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కే వెల్లడించారు. మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్‌లో మీడియాతో మాట్లాడిన దీప్కే, జూలై 29 నుంచి రాంచీలో జరుగుతున్న నిరవధిక ఆందోళనకు తమ సంఘీభావం ఉంటుందని చెప్పారు. తాము తప్పకుండా జార్ఖండ్ వెళ్తామని, అక్కడి విద్యార్థుల ప్రతీ డిమాండ్‌కు మద్దతుగా నిలుస్తామని చెప్పారు. ప్రస్తుతం సీజేపీ రాజకీయ పార్టీగా కాకుండా, ప్రెజర్ గ్రూప్‌గా పనిచేస్తుందని దీప్కే వెల్లడించారు. న్యాయవ్యవస్థ, రాజకీయాలు, మీడియా, ఎన్నికల సంఘం వంటి సంస్థలపై ప్రజల విశ్వాసం తగ్గుతోందని, వీటిలో జవాబుదారీతనం తీసుకురావడమే తమ ఉద్యమ లక్ష్యమని చెప్పారు. జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌తో పాటు ఇతర నియామక పరీక్షల్లో జరిగిన అక్రమాలపై రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తులతో స్వతంత్ర దర్యాప్తు జరపాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

# కుటుంబ కలహాలతో తండ్రి రాక్షసత్వం

**నాలుగేళ్ల కుమారుడుని బండకేసి కొట్టిన దుర్మార్గుడు**

**హైదరాబాద్, ఆగస్ట్ 5 :** నగరంలోని గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ ఘటన చోటుచేసుకుంది. కుటుంబ కలహాల నేపథ్యంలో కన్న తండ్రి.. నాలుగేళ్ల కుమారుడిపై దారుణంగా దాడి చేసిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. తండ్రి సల్మాన్.. కొడుకు అర్మాన్‌ను ఓ పిల్లర్‌కు బలంగా కొట్టి నేలపై పడేశాడు. అంతటితో ఆగకుండా బాలుడిని లారీ కిందకు నెట్టేందుకు ప్రయత్నించాడు. వెంటనే అప్రమత్తమైన స్థానికులు బాలుడిని కాపాడారు. తీవ్రంగా గాయపడిన అర్మాన్‌ను వెంటనే సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు గుడిమల్కాపూర్ పోలీసులు వెంటనే ఘటనా స్థలికి చేరుకుని నిందితుడు సల్మాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. సల్మాన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కుటుంబ కలహాలే ఈ దారుణానికి కారణమా? లేక మరేదైనా కారణం ఉందా? అనే కోణంలో పోలీసుల విచారణ కొనసాగుతోంది.

# జాతీయ రహదారులపై తగ్గిన ప్రమాదాలు

**దాదాపు 4 శాతం తగ్గిందన్న కేంద్రమంత్రి గడ్కరీ**



**న్యూఢిల్లీ,ఆగస్ట్5 :** జాతీయ రహదారులపై ప్రమాదాల తగ్గినట్లు కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. కోవిడ్ తర్వాత నేషనల్ హైవేలపై మరణాల సంఖ్య దాదాపు 4 శాతం తగ్గిందని బుధవారం పార్లమెంటులో వెల్లడించారు. హైవేలపై యాక్సిడెంట్స్ లలో చనిపోయే వారి సంఖ్య 2025లో 62 వేల 122 కు తగ్గినట్లు చెప్పారు. 2024లో 64 వేల 772 మంది రోడ్డు ప్రమాదాల్లో చనిపోతే.. 2023లో 63 వేల 112 మంది చనిపోయినట్లు తెలిపారు. ప్రతి ఏటా మరణాల సంఖ్య పెరుగుతూ వస్తుండేదని.. కానీ కరోనా తర్వాత తొలిసారి 2025లో మృతుల సంఖ్య తగ్గినట్లు చెప్పారు. అదే సమయంలో 2025లో రోడ్డు యాక్సిడెంట్ల సంఖ్య 5.30 శాతం పెరిగినట్లు చెప్పారు. అంటే 5.13 లక్షల యాక్సిడెంట్స్ జరిగినట్లు చెప్పారు. సరాసరిగా గంటకు 21 మంది చనిపోయినట్లు వెల్లడించారు. నేషనల్ హైవేస్ పై 2025లో లక్షా 43 వేల 526 ప్రమాదాలు జపగగా.. ఈ ఏడాది జులై 27 వరకు 77 వేల 234 ప్రమాదాలు జరిగినట్లు చెప్పారు. జాతీయ రహదారులపై జరిగే ప్రమాదాల్లో తమిళనాడులో ఎక్కువగా జరుగుతున్నట్లు గడ్కరీ చెప్పారు. 71 వేల 387 యాక్సిడెంట్స్ తో తమిళనాడులో ముందంజలో ఉన్నట్లు చెప్పారు. అదేసమయంలో రోడ్డు ప్రమాద మృతులలో ఉత్తరప్రదేశ్ మొదటి స్థానంలో ఉన్నట్లు తెలిపారు. 2025లో ఆ రాష్ట్రంలో 27 వేల 550 మంది చనిపోయినట్లు గణాంకాలు పార్లమెంటుకు తెలిపారు.

# ఇంటర్ కాలేజీలకు ఎన్‌వోసి తప్పనిసరి

- ఎన్‌వోసిలు పరిశీలించగా నకిలీవని తేలింది
- వీటిపై విచారణ కొనసాగుతుందన్న బోర్డు సెక్రటరీ

**హైదరాబాద్, ఆగస్ట్ 5 :** ఇంటర్మీడియట్ కాలేజీలకు ఎన్‌వోసి కంపల్సరీ చేశామని ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీ అభిలాష అభినవ్ తెలిపారు. ఇంటర్మీడియట్ బోర్డుకు వచ్చిన కొన్ని ఎన్‌వోసి లను హైడ్రాతో సంప్రదించి పరిశీలించగా, కొన్ని సర్టిఫికెట్లు బోగస్‌గా ఉన్నట్లు గుర్తించామన్నారు. హైడ్రాకు వచ్చిన దరఖాస్తుల వివరాలు ఇంటర్మీడియట్ బోర్డుకు అందడంతో నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారం వెలుగులోకి వచ్చిందని ఆమె చెప్పారు. ప్రస్తుతం ఫేక్ ఎన్‌వోసిల వ్యవహారంపై విచారణ కొనసాగుతోందని, విచారణ పూర్తయిన తర్వాత ఎన్ని నకిలీ సర్టిఫికెట్లు సమర్పించారనే విషయం స్పష్టమవుతుందని తెలిపారు. నకిలీ ఎన్‌వోసి ల విషయంలో హైడ్రా, ఇంటర్మీడియట్ బోర్డు సీరియస్‌గా ఉన్నాయని అభిలాష అభినవ్ వెల్లడించారు. ఈ వ్యవహారంపై ఇంటర్మీడియట్ బోర్డు స్థాయిలో అంతర్గత విచారణ కూడా చేపడుతున్నట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన కాలేజీలపై తగిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఫేక్ ఎన్‌వోసి ల వ్యవహారంపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఇంటర్మీడియట్ బోర్డు స్పష్టం చేసింది. విద్యార్థులకు ఎలాంటి నష్టం కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని అభిలాష అభినవ్ తెలిపారు. కాలేజీల అనుమతులకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని, తల్లిదండ్రులు ఏవైనా సందేహాలు ఉంటే వెబ్‌సైట్ ద్వారా తనిఖీ చేసుకోవచ్చని సూచించారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి 3 వేలకుపైగా ఇంటర్మీడియట్ కాలేజీలు అనుమతులు పొందినట్లు ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీ అభిలాష అభినవ్ తెలిపారు.

# ఎయిర్‌పోర్టుకు రోడ్డు ఇవ్వొద్దు

**గ్రామస్తుల ధర్నా**

**ఆదిలాబాద్,ఆగస్ట్5 :** ఆదిలాబాద్‌లో ఏర్పాటు చేయనున్న ఎయిర్‌పోర్టు కోసం తమ గ్రామ రోడ్డును తీసుకుంటే మొత్తం గ్రామాన్ని తీసుకోవాలని కోరుతూ అనుకుంటా గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. బుధవారం గ్రామానికి చెందిన రైతులు కలెక్టరేట్‌కు తరలివచ్చి బైఠాయించి నిరసన తెలిపారు. ఎయిర్‌పోర్టు నిర్మాణం వల్ల నష్టపోతున్న తమ భూములకు రూ.6 కోట్లు చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. గ్రామస్తులు ప్రస్తుతం ఆదిలాబాద్ పట్టణానికి చేరుకోవాలంటే కేవలం రెండు కిలోమీటర్ల దూరం మాత్రమే ప్రయాణం చేస్తుండగా రోడ్డు ఎయిర్‌పోర్టులో పోతే 16 కిలోమీటర్లు దూర భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడే అవకాశముందని పేర్కొన్నారు. రోడ్డుతో పాటు తమ గ్రామాన్ని మొత్తం తీసుకొని ఇతర ప్రాంతంలో తమకు పునరావసం కల్పించాలని కోరారు.

# ఉదయనిధి బరితెగింపు విమర్శలు!



**అధికారంలో ఉంటే పెసరం మాటలు.. రెచ్చగొట్టే ప్రసంగాలు.. సనాతన ధర్మంపై అవాకులు చెవాకులు పేలడం వంటివన్నీ చూశాం. డిఎంకె నేత ఉదయనిధి స్టాలిన్ నేపథ్యం ఇది. ఏదిపడితే అది మాట్లాడిన తీరుపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం అయ్యాయి. డిప్యూటి సిఎంగా అధికారం వెలగబెడుతూనే సనాతన ధర్మంపై నోరు పారేసుకున్నాడు. ఇలాంటి వారికి నటుడు ప్రకాశ్ రాజ్ లాంటి వారు చెంచాలుగా ఉన్నారు. తాజాగా ఉదయనిధి చేసిన వ్యాఖ్యలు తమిళనాట రచ్చరేపాయి. త్రిషా కృష్ణన్‌పై చేసిన వ్యాఖ్యలకు అరెస్టయి, కోర్టు తీర్పుతో బెయిల్‌పై బయటకు వచ్చాడు. అయినా తన పెడసరం మాటలాను తగ్గించుకుంటా నని అనడం లేదు. డిప్యూటి సిఎంగా పనిచేసిన వ్యక్తి కొంత సంయమనంగా ఉండాలి. అంత మాత్రాన నోటికి ఎంత వస్తే అంత మాట్లాడేస్తానంటే కుదరదు.**

తాత కరుణానిధి, తండ్రి స్టాలిన్ సంపాదించిన పొలిటికల్ క్రెడిబిలిటీని వివాదా స్పద వ్యాఖ్యలతో మంటకలిపేయడం లక్ష్యంగా ఉదయనిధి రాజకీయాలు సాగుతున్నాయి. తమిళనాడు రాజకీయ చరిత్రలో నాయకుల మధ్య విమర్శలు, ప్రతి విమర్శలు సర్వసాధారణం. అయితే రాజకీయ విమర్శల పేరుతో వ్యక్తిగత విషయాల జోలికి వెళ్లడం ఆందోళన కలిగించే విషయం. ప్రజా సమస్యలపై పోరాడాల్సిన ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆయన ఇమేజ్‌ను దిగజార్చే అవకాశాలు న్నాయి. శశికళ నుంచి నేటి త్రిష కామెంట్స్ వరకు ఆయన వ్యవహార శైలి రాజకీయాల్లో నైతికతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. నిరసనల్లో పొలిటికల్ పాయింట్లు మాట్లాడకుండా వ్యక్తిగత దాడులకు దిగడం సరైన పద్ధతి కాదన్నది అందరూ ముక్త కంఠంతో విమర్శించారు. ఈ తరహా వివాదాస్పద వ్యాఖ్యలు రాబోయే రోజుల్లో డీఎంకే పార్టీకి ఎలాంటి రాజకీయ మూల్యాన్ని చెల్లించేలా చేస్తాయో వేచి చూడాలి. అయితే రాజకీయాల్లో విమర్శలు సహజమే.. కానీ వ్యక్తిగత స్థాయికి దిగజారి మహిళలపై నోరు పారేసుకోవడం ఉదయ్ నిధి స్టాలిన్ వంటి నేతలకు మాత్రమే సాధ్యమని రుజువు చేసుకున్నారు.

నటి త్రిషపై ఆయన చేసిన వ్యాఖ్యలతో తమిళనాడు ఒక్కసారిగా భగ్గుమంది.. అయితే ఇలాంటి మాటలు మాట్లాడటం ఆయన కు కొత్తేమీ కాదు. సనాతన ధర్మంపై ఆ మధ్య నోరు పారేసుకున్న ఉదయనిధి స్టాలిన్, గతంలోనూ నోటికి ఎంతొస్తే అంత మాట్లాడే వారు. తంజావూరులో కావేరి నీటి పంపకాల అంశంపై నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఉదయనిధి స్టాలిన్ మాట్లాడిన సందర్భంగా ప్రభుత్వ తీరును, ముఖ్యమంత్రి విజయ్‌ను తీవ్రంగా విమర్శించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడం మానేసి డీఎంకేపై రాజకీయ కక్షసాధింపులకు విజయ్ ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. ఉదయనిధి ప్రసంగిస్తున్న సమయంలో డీఎంకే కార్యకర్తలు నటి త్రిష పేరును నినాదాలుగా చేయడం ప్రారంభించారు. దానికి స్పందించిన ఉదయనిధి మన ప్రాంతానికి నీళ్లు రాకపోయినా పర్లేదు అక్కడ నీ ళ్లు చేరాలనేది ఆయన ఆలోచన అని డబుల్ మీనింగ్ వచ్చేలా మాట్లాడారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యాయి. మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సహా పలువురు రాజకీయ నాయకులు దీనిని తీవ్రంగా ఖండించారు. ఇలాంటి నీచమైన మాటలతో మహిళలను కించపరిచా రని విమర్శిస్తున్నారు.

ఉదయనిధి స్టాలిన్ మహిళలను ప్రత్యర్థుల వ్యక్తిగత జీవితాలను లక్ష్యంగా చేసుకోవడం ఇదే మొదటిసారి కాదు. ఆయన ఎమ్మెల్యే కాకముందు నుంచి కూడా వరుస వివాదాస్పద వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. 2021 అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో అప్పటి ముఖ్యమంత్రి పళనిస్వామిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. శశికళ కాళ్లను పట్టుకోవడానికి పళనిస్వామి శవంలా పాకారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రసంగం వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అన్నాడిఎంకె నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆయనపై డిఫమేషన్ కేసు కూడా నమోదు చేశారు. మహిళా నాయకులను, రాజకీయ ప్రత్యర్థులను దిగజార్చేలా మాట్లాడటం ఆయన శైలిగా మారిందనే విమర్శలు వచ్చాయి. విజయ్ నేతృత్వంలోని టీవీకే అధికారంలోకి వచ్చిన తర్వాత ఉదయనిధి తన వ్యాఖ్యల జోరు తగ్గించలేదు. దీనికితోడు అధికారం కోల్పోవడంతో తట్టుకోలేక పోతున్నాడు. మీడియా సమావేశంలో, తన ఎక్స్ ఖాతా పోస్ట్ ద్వారా ముఖ్య మంత్రి విజయ్‌ను సూటిగా లక్ష్యంగా చేసుకున్నారు. అసెంబ్లీ గౌరవానికి భంగం కలిగిం చేలా కుట్టి స్టోరీ చెప్పడం తగదని వ్యాఖ్యానించారు. చెంగల్పట్టు కోర్టులో భర్త కోసం వెతుకుతున్న భార్య కథ తమిళనాడు అంతటికీ తెలుసంటూ వ్యక్తిగత వ్యాఖ్యలు చేశారు. విజయ్, ఆయన భార్య సంగీత మధ్య ఉన్న వివాదాలను ఈ రకంగా ప్రస్తావించడంపై టీవీకే శ్రేణులు భగ్గుమన్నాయి. మరో సందర్భంలో మాట్లాడిన ఉదయ్ నిధి త్వరలోనే టీవీకే ఎమ్మెల్యేలు అసెంబ్లీ ప్రాంగణంలో ఐటమ్ పాటలకు డాన్సులు చేస్తారని ఎద్దేవా చేశారు. ఈ వ్యాఖ్యలు శాసనసభ గౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. డిఎంకె అధినేత స్టాలిన్ తన కుమారుడిని కంట్రోల్ చేసుకోవాల్సిందే. లేకుంటే ఈ విపరీతాలు ఎంతకైనా దారితీస్తాయి. విమర్శలకు అలవాటు పడ్డ ఉదయనిధి ఇకముందు వివాదాలు సృష్టించేలా మాట్లాడకుండా ఉండలేడు. అందువల్ల డిఎంకె అధినేత స్టాలిన్‌ను అదుపులో పెట్టుకోకుంటే మూల్యం చెల్లించడం ఖాయం.

# హర్మూజ్ తెరవకుంటే అంతే సంగతులు

## మరోమారు ఇరాన్‌కు ట్రంప్ ఘాటు హెచ్చరిక



**వాషింగ్టన్, ఆగస్ట్ 5 :** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌కు మరోసారి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. హర్మూజ్ జలసంధిని సాధ్యమైనంత త్వరగా తెరవాలని, లేదంటే తీవ్రమైన దాడులు ఎదుర్కోవాల్సి ఉంటుందని వార్నింగ్ ఇచ్చారు. ఇరాన్‌తో తమ చర్చలు సానుకూలంగా సాగుతున్నా.. వాటిని ఆ దేశం బహిరంగంగా ఖండించడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. ఈసారి చర్చల నుంచి వెనక్కి తగ్గితే పరిణామాలు అత్యంత తీవ్రంగా ఉంటాయని టెహ్రాన్‌ను హెచ్చరించారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అతిపెద్ద దాడికి అమెరికా సిద్ధమవుతున్న సమయంలో ఇరాన్ తమను సంప్రదించి చర్చలకు రావాలని కోరిందని ట్రంప్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇరాన్ విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై మరో 48 గంటల్లో స్పష్టత వస్తుందని తెలిపారు. టెహ్రాన్ అణ్వాయుధాలు కలిగి ఉండేందుకు అమెరికా ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోదని అధ్యక్షుడు పునరుద్ఘాటించారు. హర్మూజ్ జలసంధిలో నౌకల స్వేచ్ఛాయుత రాకపోకలకు సంబంధించి ఇరాన్, ఒమన్‌తో కలిసి తాము చర్చలు జరుపుతున్నామని అగ్రరాజ్యం వెల్లడించింది. దీనిపై ఒకట్రెండు రోజుల్లో ఒప్పందం కుదిరే అవకాశం ఉందని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ తెలిపారు. అయితే ఈ ప్రకటనను ఇరాన్ ఖండించింది. ఒమన్‌తో తాము జరుపుతున్న చర్చల్లో అమెరికా భాగస్వామ్యం ఏమాత్రం లేదని తెలిపింది. తమ సార్వభౌమాధికారాన్ని, భద్రతా ప్రయోజనాలను కాపాడే కొత్త సముద్ర రవాణా విధానాన్ని ఏర్పాటు చేయడంపైనే ఈ చర్చలు సాగుతున్నాయని పేర్కొంది. ఈ పరిణామాల నేపథ్యంలో ట్రంప్ తాజా హెచ్చరికలు చేయడం చర్చనీయాంశంగా మారింది. దీంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఏ మలుపు తిరుగుతాయన్న దానిపై ఉత్కంఠ నెలకొంది.

# అవసరమైతే వందసార్లయినా అరెస్ట్ అవుతా

## ఎవరి బెదిరింపులకు లొంగేది లేదు : ఉదయనిధి



**చెన్నై, ఆగస్ట్ 5 :** సినీ నటి త్రిషా కృష్ణన్‌పై చేసిన వ్యాఖ్యల వివాదంలో అరెస్టయి, విడుదలైన.. డీఎంకే సీనియర్ నేత, తమిళనాడు ప్రతిపక్ష నాయకుడు ఉదయనిధి స్టాలిన్ కీలక వ్యాఖ్యలు చేశారు. విడుదల అనంతరం తన తండ్రి, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్‌తో ఉన్న ఫొటోను సోషల్ మీడియా 'ఎక్స్'లో షేర్ చేసిన ఆయన.. రాజకీయ ఒత్తిళ్లకు తాను భయపడబోనని స్పష్టం చేశారు. 'నేను కలైంజర్ మనవడిని.. ఎంకే స్టాలిన్ కుమారుడిని.. డీఎంకే కార్యకర్తను. ఇలాంటి బెదిరింపులకు భయపడేది లేదు. రైతుల కోసం పోరాడే క్రమంలో ఒక్కసారి కాదు.. అవసరమైతే వందసార్లు అరెస్ట్ అయ్యేందుకైనా సిద్ధమే. ప్రజాసేవను ఎలాంటి అణచివేత ఆపలేదు' అని ఉదయనిధి స్టాలిన్ తన ఎక్స్ పోస్ట్‌లో రాసుకొచ్చారు. అంతకుముందు.. త్రిషా కృష్ణన్‌పై ఉధయనిధి చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీశాయి. దీంతో మంగళవారం(ఈనెల 4న) పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం సాయంత్రం విడుదల చేశారు. ఆ తర్వాత అధికార పక్షాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారాయన. రైతుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన ప్రభుత్వం.. ప్రజల దృష్టిని మళ్లించేందుకే తనను అరెస్ట్ చేయించిందని ఆరోపించారు. తంజావూరులో తాను చేసిన ప్రసంగాన్ని వక్రీకరించి అసత్య ప్రచారం చేశారని, తప్పుడు కేసులు బనాయించి రాజకీయంగా వేధించేందుకు యత్నించారన్నారు. అరెస్ట్ చేసిన సమయంలో తానేమాత్రం భయపడలేదని, మీడియా ఎదుట ఈ చర్యను హాస్యాస్పదంగా భావిస్తున్నానని చెప్పి మరీ పోలీసులతో వెళ్లానని తెలిపారు. తానెప్పుడూ పారిపోలేదని, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గబోనని చెప్పుకొచ్చారు ఉదయనిధి. లాగే గతంలో కరూర్ తొక్కిసలాట ఘటనను ప్రస్తావిస్తూ.. అధికార పక్షంపై ఉధయనిధి విమర్శలకు దిగారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వం స్పందించకుండా రాజకీయ కక్షసాధింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. తన అరెస్ట్‌ను ఖండిస్తూ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టిన డీఎంకే కార్యకర్తలు, మిత్రపక్ష, ఇతర రాజకీయ పార్టీల నేతలకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తనకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు.




# విశాఖలో పివి సింధు స్పోర్ట్స్ అకాడమీ

## శంకుస్థాపన చేసిన మంత్రి నారా లోకేశ్

## ప్రపంచస్థాయి క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యం

**విశాఖపట్నం, ఆగస్ట్ 5 :** ప్రపంచ స్థాయి క్రీడాకారులను ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు అకాడమీ తయారు చేస్తోందని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. యువత ముఖంలోనే దేశ భవిష్యత్తు దాగి ఉందని పేర్కొన్నారు. పీవీ సింధు అకాడమీ ద్వారా క్రీడాకారులు వారిలోని ప్రతిభను మరింత మెరుగుపరుచుకోవచ్చని సూచించారు. ఎలాంటి సదుపాయాలు లేని రోజుల్లోనే పట్టుదల, క్రమశిక్షణతో సింధు ఒలింపిక్స్ పతక విజేతగా, ప్రపంచ ఛాంపియన్‌గా ఎదిగారని ఉద్ఘాటించారు. విశాఖపట్నం అరిలోవ ప్రాంతంలోని తోటగరువులో తలపెట్టిన పీవీ సింధు సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ నిర్మాణ పనులకు మంత్రి నారా లోకేశ్ బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ప్రసంగించారు. ప్రతి ఛాంపియన్ వెనుక కష్టపడిన తల్లిదండ్రులు, ఎప్పుడూ వెన్నుదన్నుగా నిలిచే కోచ్‌లు ఉంటారని మంత్రి లోకేశ్ వ్యాఖ్యానించారు. కేవలం బ్యాడ్మింటనే కాకుండా, అన్ని రకాల క్రీడలకు కేంద్రంగా ఈ అకాడమీని తీర్చిదిద్దాలనేది సీఎం చంద్రబాబు ఆలోచన అని పేర్కొన్నారు. ఈ మేరకు ఈ అకాడమీ రూపుదిద్దుకుంటోందని వివరించారు. ఈ సంస్థ బ్యాడ్మింటన్‌కే పరిమితం కాకుండా.. స్విమ్మింగ్, జిమ్నాస్టిక్స్, షూటింగ్, వెయిట్‌లిఫ్టింగ్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్ క్రీడలకు కూడా నిలయంగా మారనుందని వెల్లడించారు. ఆస్ట్రేలియా, ఖతార్ తరహాలో మన దేశంలోనూ ప్రపంచ స్థాయి క్రీడాకారులను తయారు చేసేందుకు ఈ సంస్థ వేదిక కానుందని తెలిపారు. విశాఖపట్నంలో ఈ అకాడమీ నిర్మాణం విజయవంతం కావడానికి తమ ప్రభుత్వం, ప్రజల సహకారం ఎప్పుడూ ఉంటుందని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. 90వ దశకంలోనే క్రీడలపై సీఎం చంద్రబాబు నమ్మకం ఉంచారని ప్రస్తావించారు. ఆ మేరకు ప్రభుత్వ ఉద్యోగాల్లో క్రీడాకారులకు ప్రాధాన్యం కల్పించి క్రీడా విప్లవానికి చంద్రబాబు బాటలు వేశారని ఉద్ఘాటించారు. ఈ అకాడమీ కేవలం బ్యాడ్మింటన్ మాత్రమే కాకుండా, అనేక క్రీడలకు కేంద్రంగా మారి ఆంధ్రప్రదేశ్‌లో క్రీడా సంస్కృతిని పెంచుతుందని వివరించారు. తరగతి గది జ్ఞానాన్ని ఇస్తే, క్రీడలు మనకు వ్యక్తిత్వాన్ని, పోరాట పటిమను నేర్పుతాయని చెప్పుకొచ్చారు. అందుకే ఏపీలో ప్రతి శనివారం 'నో బ్యాగ్ డే'గా ప్రకటించామని తెలిపారు. ప్రతి చిన్నారిలోనూ ఒక సహజ ప్రతిభ దాగి ఉంటుందని వివరించారు. దానిని వెలికితీసి ప్రోత్సహించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.



# గోదావరి వరదలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం

## వరదల నుంచి రక్షణకు కరకట్ట నిర్మాణం

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్ 5 :** ప్రతి ఏడాది గోదావరి వరదలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండల ప్రజలకు శాశ్వత పరిష్కారం దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గోదావరి వరదల నుంచి మండలంలోని పలు గ్రామాలను రక్షించేందుకు కరకట్ట నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తొలి దశలో సుమారు 270 నుంచి 300 ఎకరాల భూసేకరణ చేపట్టేందుకు అధికారులు ఏర్పాట్లు ప్రారంభించారు. సంజీవరెడ్డిపాలెం నుంచి బూర్గంపహాడ్ మీదుగా నాగినేనిప్రోలు రెడ్డిపాలెం వరకు 17 మీటర్ల ఎత్తుతో, 12 కిలో మీటర్ల పొడవున కరకట్ట నిర్మించనున్నారు. భూమి అడుగు భాగంలో సుమారు 180 మీటర్ల వెడల్పుతో, పైభాగంలో ఐదు మీటర్ల వెడల్పుతో ఈ రక్షణ గోడను నిర్మించనున్నట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. కరకట్ట నిర్మాణంతో పాటు మండలంలో వర్షపు నీరు గోదావరిలోకి వెళ్లేలా రెండు పంప్‌హౌస్‌లను కూడా ఏర్పాటు చేయనున్నారు. నాగినేనిప్రోలు రెడ్డిపాలెం సమీపంలోని పెదవాగు నుంచి ప్రారంభమయ్యే కరకట్ట, సంజీవరెడ్డిపాలెం సమీపంలోని దోమలవాగు వరకు నిర్మించనున్నారు. కరకట్ట నిర్మాణంతో సంజీవరెడ్డిపాలెం, బూర్గంపహాడ్, నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామాలతో పాటు మండల కేంద్రానికి గోదావరి, కిన్నెరసాని వరదల ముప్పు నుంచి రక్షణ లభించనుంది. ప్రతి ఏడాది వరదల కారణంగా పంటలు, ఇళ్లు ముంపునకు గురవడం, ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలిపోవాల్సిన పరిస్థితికి శాశ్వత పరిష్కారం లభిస్తుందని అధికారులు భావిస్తున్నారు. కరకట్ట నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కోసం ఇప్పటికే భద్రాచలం సబ్‌కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. వారంలోపు భూసేకరణ సర్వే పనులు ప్రారంభిస్తామని నీటిపారుదల శాఖ ఈఈ వెంకటేశ్వరరావు తెలిపారు. తొలి దశలో 270 నుంచి 300 ఎకరాల భూమిని సేకరించనున్నట్లు వెల్లడించారు. వారం రోజుల్లో భూసేకరణకు పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.



# తమిళనాట తొలి బడ్జెట్ ప్రవేశపెట్టిన విజయ్ ప్రభుత్వం

- **'అన్నన్ సీర్ తిట్టమ్'నకు బడ్జెట్‌లో రూ.812 కోట్లు కేటాయింపు**
- **పథకం కింద వధువుకు 8 గ్రాముల బంగారం, ఒక పట్టుచీర**

**చెన్నై, ఆగస్ట్ 5 :** తమిళనాడు ప్రభుత్వం బుధవారం అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టింది. సీఎంగా విజయ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత తీసుకొచ్చిన తొలి బడ్జెట్ కావడంతో సర్వత్రా ఆసక్తి వ్యక్తమైంది. ఆర్థిక మంత్రి ఎన్. మేరీ విల్సన్ దీనిని సభ ముందుంచారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, మహిళా సంక్షేమం, మౌలిక సదుపాయాలపై విజయ్ సర్కార్ ఈ పద్దులో ప్రధానంగా దృష్టిసారించింది. ఎన్నికల హామీల్లో భాగమైన 'అన్నన్ సీర్ తిట్టమ్'ను టీవీకే ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో ప్రకటించింది. దానికింద వధువుకు 8 గ్రాముల బంగారం, ఒక పట్టుచీరను అందిస్తారు. ఈ పథకం కోసం రూ.812 కోట్లు కేటాయించారు. 2031 నాటికి ఐదు లక్షల మందికి కృత్రిమ మేధలో శిక్షణ ఇస్తామని ప్రకటించింది. ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులకు ఈ శిక్షణ అందనుంది. వెట్రిథిరన్ ట్రైనింగ్ స్కీమ్ కింద దశలవారీగా లక్షమంది ఉద్యోగార్థులు నైపుణ్యాభివృద్ధి శిక్షణ పొందనున్నారు. రూ. 2వేల కోట్లతో విద్యార్థులకు ఉచితంగా ల్యాప్‌టాప్స్ అందించేందుకు వెట్రి ల్యాప్‌టాప్ స్కీమ్‌ను బ్జడెట్‌లో ప్రకటించారు. ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణ కోసం ఈ ఏడాదికి రూ.300 కోట్లు కేటాయించారు. 'పుతియా పయనం-పుతియా వేగం' పథకం కింద 11వ తరగతి చదివే 5.3 లక్షల మంది విద్యార్థులకు ఉచిత సైకిళ్లు అందించనున్నారు. వాటితో పాటు హెల్మెట్లు, వాటిల్ బాటిళ్లు ఇవ్వనున్నారు. కుటుంబ పెద్దగా ఉన్న మహిళకు ప్రతినెలా రూ. 2,500, ఏడాదికి ఉచితంగా 6 వంటగ్యాస్ సిలిండర్లు, నిరుద్యోగ యువతకు ఆర్థిక సాయం, మహిళలకు అన్ని ప్రభుత్వ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణం వంటి హామీలపై మాత్రం బడ్జెట్లో ప్రకటన రాలేదు.

# దుబాయ్‌లో పాతబస్తీ యువతి మిస్సింగ్

- **నాలుగు నెలలుగా సమాచారం లేక ఆందోళన**
- **శంషాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసిన కుటుంబ సభ్యులు**

**హైదరాబాద్, ఆగస్ట్ 5 :** దుబాయ్‌లో హైదరాబాద్ యువతి మిస్సింగ్ కలకలం రేపుతోంది. గత కొద్ది నెలలుగా ఆమె నుంచి ఎటువంటి ఫోన్ కాల్స్ కానీ.. సమాచారం కానీ లేకపోవడంతో ఆందోళన చెందిన ఆమె కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు బాధిత కుటుంబం ఫిర్యాదు మేరకు ఆర్జీఐఏ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతబస్తీకి చెందిన ఓ కుటుంబ పెద్ద మృతిచెందడంతో ఆ కుటుంబం ఆర్థికంగా బాగా చితికిపోయింది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తన కుటుంబాన్ని పోషించేందుకు వైద్య విద్య పూర్తి చేసిన ఓ యువతి (24) ఉపాధి కోసం దుబాయ్‌కు వెళ్లింది. గత ఏడాది ఆగస్టులో దుబాయ్‌కు వెళ్లిన ఆమె అక్కడి ఓ ఆస్పత్రిలో విధుల్లో చేరింది. దుబాయ్ వెళ్లిన తర్వాత సదరు యువతి కొంతకాలం పాటు కుటుంబసభ్యులతో ఫోన్‌లో మాట్లాడేది. అయితే గత నాలుగు నెలలుగా ఆమె నుంచి ఎటువంటి సమాచా రం లేదు. ఆమె రెండు ఫోన్లకు కాల్ చేసినా పనిచేయడం లేదు. దీంతో కంగారుపడిపో యిన కుటుంబసభ్యులు దుబాయ్‌లో ఉన్న తెలిసి వారి ద్వారా ఆరా తీశారు. అయి నప్పటికీ యువతి ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలోనే యువతి కుటుంబసభ్యులు శంషాబాద్‌లోని ఆర్జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు.



## తైక్వాండో పోటీల్లో కల్లం అంజిరెడ్డి విద్యాలయానికి ఓవరాల్ ఛాంపియన్‌షిప్

**శేరిలింగంపల్లి, ఆగస్టు 5 (జనం వార్త):** వికారాబాద్ జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 2న వికారాబాద్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో మదీనాగూడలోని కల్లం అంజిరెడ్డి విద్యాలయ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. సబ్‌జూనియర్, జూనియర్ విభాగాల్లో పోటీపడిన విద్యార్థులు మొత్తం 14 బంగారు పతకాలు సాధించి పాఠశాలకు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ అందించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు త్వరలో కరీంనగర్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి తైక్వాండో ఛాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విజేతలతో పాటు వారికి శిక్షణ అందించిన కోచ్‌లు, తల్లిదండ్రులను వికారాబాద్ జిల్లా తైక్వాండో అసోసియేషన్ అభినందించింది. పాఠశాల ప్రిన్సిపల్ డా. విజయలక్ష్మి విజేతలను అభినందిస్తూ, రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా ఇదే స్ఫూర్తితో రాణించి పాఠశాలకు, జిల్లాకు మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల విజయానికి కృషి చేసిన జట్టు నిర్వాహకులు, శారీరక విద్య ఉపాధ్యాయులు శేఖర్, శ్రీకాంత్ లను ప్రత్యేకంగా అభినందించారు.



## హైదరాబాద్‌లో మాణిక్యరావుకు ఘన స్వాగతం

### జూబ్లీహిల్స్ సీఐ ముత్తు యాదవ్‌కు సన్మానం

**శేరిలింగంపల్లి, ఆగస్టు 5(జనం వార్త):** అండమాన్--నికోబార్ దీవుల కేంద్రపాలిత ప్రాంత తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మాణిక్యరావు హైదరాబాద్‌కు విచ్చేసిన సందర్భంగా ట్రూ హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మారమోని శ్రీశైలం యాదవ్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇటీవల జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ)గా బాధ్యతలు స్వీకరించిన ముత్తు యాదవ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ప్రజలకు న్యాయబద్ధమైన, పారదర్శకమైన, ప్రజాసేవకు అంకితమైన పోలీసింగ్ అందిస్తూ విజయవంతంగా విధులు నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రజా సేవ, సామాజిక ఐక్యత, పరస్పర సహకారంతో సమాజాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో భారత్ కిసాన్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డీకే చంద్రశేఖర్ యాదవ్, గురుస్వామి, లక్ష్మణ్, రమణ, వంశీ తదితరులు పాల్గొని మాణిక్యరావు, సీఐ ముత్తు యాదవ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



## రైతు సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలి

### సింగరేణిలో డిప్యూటీ తహసీల్దార్‌కు అఖిలభారత ఐక్య రైతు సంఘం వినతిపత్రం

**కారేపల్లి :** సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ అనుబంధ అఖిలభారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సింగరేణి మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మండల డిప్యూటీ తహసీల్దార్‌కు రైతు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం డివిజన్ నాయకుడు గుగులోతు తేజ నాయక్ మాట్లాడుతూ, ప్రభుత్వం, వాతావరణ శాఖ ప్రకటనలను నమ్మి ఖరీఫ్ సాగు ప్రారంభించిన రైతులకు ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో విత్తిన విత్తనాలు మొలకెత్తకుండా ఎండిపోతున్నాయని అన్నారు. నష్టపోయిన రైతులకు తక్షణ నష్టపరిహారం అందించాలని, స్వల్పకాలిక పంటల విత్తనాలు, ఎరువులు ఉచితంగా ఇవ్వాలని, రైతుల పాత రుణాలను పూర్తిగా మాఫీ చేసి వడ్డీ లేని కొత్త పంట రుణాలు మంజూరు చేయాలని, పంటల బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో పశుగ్రాసం, తాగునీటి సౌకర్యాలు కల్పించ డంతో పాటు ఎండిపోతున్న పంటలకు ప్రాజెక్టుల ద్వారా సాగునీరు అందించాలని కోరారు. పోడు సాగుకు అటవీ శాఖ అధికారుల ఆటంకాలను తొలగించి, పట్టా పోడు భూముల్లో ట్రాక్టర్లతో సాగు చేసుకునేందుకు ఎలాంటి ఆంక్షలు లేకుండా అనుమతించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత ఐక్య రైతు సంఘం డివిజన్ కమిటీ అధ్యక్షుడు పులకని సత్తిరెడ్డి, డివిజన్ నాయకుడు వడ్డే వెంకటేశ్వర్లు, అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం డివిజన్ కమిటీ సభ్యుడు రావుల నాగేశ్వరరావు, సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ సింగరేణి మండల నాయకుడు బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## గ్రామాభివృద్ధికి రెడ్డిబోయిన నాగేశ్వరరావు చేయూత

### ఉసిరికాయలపల్లిలో టైలరింగ్ కేంద్రం ప్రారంభం

**కారేపల్లి :** మండలంలోని ఉసిరికాయలపల్లి గ్రామపంచాయతీలో గ్రామాభివృద్ధి, మహిళా సాధికారతకు ఊతమిచ్చే రెండు ముఖ్యమైన కార్యక్రమాలు సర్పంచ్ గుగులోత్ వరలక్ష్మి రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. మొదటగా గ్రామానికి చెందిన భూదాత రెడ్డిబోయిన నాగేశ్వరరావు, తన తల్లిదండ్రులు చౌదయ్య--పెంటమ్మల జ్ఞాపకార్థంగా గ్రామపంచాయతీకి ఒక గుంట భూమిని విరాళంగా అందజేశారు. గ్రామాభివృద్ధికి ఉపయోగపడే విధంగా ఈ భూమిని వినియోగించనున్నట్లు సర్పంచ్ తెలిపారు. గ్రామ ప్రయోజనాల కోసం స్వచ్ఛందంగా భూమిని విరాళంగా అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం విజేత మండల సమాఖ్య సౌజన్యంతో ఏర్పాటు చేసిన టైలరింగ్ కేంద్రాన్ని ప్రారంభించి ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల విద్యార్థులకు అవసరమైన యూనిఫాంల కుట్టు పనులను ప్రారంభించారు.

# పెప్పర్ స్ప్రేతో మహిళపై దాడి

### 4 తులాల మంగళసూత్రం అపహరణ

- డెలివరీ పేరుతో ఇంట్లోకి చొరబడి దోపిడీకి పాల్పడిన నిందితుడు అరెస్ట్
- సీసీటీవీ ఆధారాలతో ఏపీలో చిక్కిన ఘరానా చైన్ స్నాచర్



**శేరిలింగంపల్లి, ఆగస్టు 5 (జనం వార్త):** కొరియర్ డెలివరీ సిబ్బంది వేషంలో ఇంట్లోకి ప్రవేశించి ఒంటరిగా ఉన్న మహిళపై పెప్పర్ స్ప్రే చల్లి ఆమె మెడలోని బంగారు మంగళసూత్రాన్ని అపహరించిన ఘరానా చైన్ స్నాచర్‌ను మియాపూర్ పోలీసులు చాకచక్యంగా అరెస్ట్ చేశారు. సీసీటీవీ దృశ్యాలు, సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితుడిని గుర్తించి ఆంధ్రప్రదేశ్‌లో అదుపులోకి తీసుకుని, అపహరించిన బంగారు ఆభరణాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళ ఇంటికి కొరియర్ డెలివరీ ఇవ్వాల్సి ఉందని చెప్పి నిందితుడు చేరుకున్నాడు. మహిళ తలుపు తీయగానే కొరియర్ అందజేస్తానని నమ్మించి ఇంట్లోకి ప్రవేశించాడు. అనంతరం మహిళ ముఖంపై పెప్పర్ స్ప్రే చల్లి, ఆమె మెడలో ఉన్న సుమారు నాలుగు తులాల బంగారు మంగళసూత్రాన్ని లాక్కొని అక్కడి నుంచి పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన మియాపూర్ పోలీసులు వెంటనే దర్యాప్తు ప్రారంభించారు. ఘటనాస్థల పరిసరాల్లోని సీసీటీవీ కెమెరాల దృశ్యాలను పరిశీలించి, ఇతర సాంకేతిక ఆధారాలను విశ్లేషించి నిందితుడి కదలికలను గుర్తించారు. దర్యాప్తులో నిందితుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా కనిగిరికి చెందిన 20 ఏళ్ల షేక్ ఖాజా అర్షాల్‌గా గుర్తించి, ప్రత్యేక బృందం అతడిని అదుపులోకి తీసుకుంది. నిందితుడి వద్ద నుంచి అపహరించిన సుమారు నాలుగు తులాల బంగారు మంగళసూత్రంతో పాటు నేరానికి ఉపయోగించిన ఆయుర్వేద మందుల ప్యాకెట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నిందితుడిపై గతంలో కూడా కనిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు క్రిమినల్ కేసులు నమోదైనట్లు వెల్లడైంది. ఒంటరిగా నివసిస్తున్న మహిళలను లక్ష్యంగా చేసుకుని, కొరియర్ డెలివరీ పేరుతో ఇంట్లోకి ప్రవేశించి పెప్పర్ స్ప్రే ఉపయోగించి దోపిడీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిచయం లేని వ్యక్తులను పూర్తిగా నిర్ధారించుకోకుండా ఇంట్లోకి అనుమతించవద్దని సూచించారు. కొరియర్ పేరుతో వచ్చిన వారిపై అనుమానం కలిగితే వెంటనే 100 లేదా 112 నంబర్లకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కేసును వేగంగా ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేయడంలో కీలక పాత్ర పోషించిన మియాపూర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ విజయ్ నాయక్, ఎస్ఐ నరసింహారెడ్డి, హెడ్ కానిస్టేబుళ్లు ప్రేమ్ కుమార్, యాదయ్య, కానిస్టేబుళ్లు రూశ్వేశ్వర్, పూర్ణచందర్ తదితర క్రైమ్ సిబ్బందిని కూకట్‌పల్లి జోన్ డీసీపీ అభినందించి, వారి సేవలను ప్రశంసించారు.

# బిజినాపల్లిలో నకిలీ 500 నోట్ల కలకలం

**నాగర్ కర్నూల్, బిజినపల్లి ఆగస్టు 5(జనం వార్త ):** నాగర్ కర్నూల్ జిల్లాలో బిజినపల్లి మండలం మంగనూరు గ్రామంలో 500 నోట్ల చలామణి కలకలం రేపింది. బిజినాపల్లి లోని ఒక వైన్స్ యజమాని బ్యాంకులో డిడి కట్టేందుకు ఇచ్చిన నగదులో కొన్ని నకిలీ నోట్ల చలామణి అయినట్లు సమాచారం. మద్యం దుకాణాలు, పెట్రోల్ బంకులు, కిరణం స్టోర్లు ముఠా టార్గెట్ చేసినట్లు తెలుస్తోంది. ఈ కేసులో బిజినపల్లి మండలం





మంగనూరుకి చెందిన ఇద్దరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జిల్లాలోకి నకిలీ నోట్లు ఎలా చేరాయిని కోణంలో పోలీసులు ఆరా తిస్తున్నారు . భీమవరం నుండి నకిలీ నోట్లు పెద్ద ఎత్తున నాగర్ కర్నూల్ జిల్లాల్లో చలామణి అయినట్లు తెలిసి దర్యాప్తులో భాగంగా పోలీస్ బృందం ఆంధ్రప్రదేశ్ లోని భీమవరం వెళ్లి విచారణ జరుగుతున్నారు. సమగ్ర విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని బిజినపల్లి ఎస్ఐ షాంశుద్ధిన్ తెలిపారు

# హెచ్‌పీవీ వ్యాక్సినేషన్‌పై అవగాహన

**నాగర్‌కర్నూల్ జిల్లా, బిజినపల్లి, ఆగస్టు 5 (జనం వార్త):** బిజినపల్లి మండల కేంద్రంలోని ఆల్ సెయింట్స్ మోడల్ హైస్కూల్‌లో బుధవారం హెచ్‌పీవీ వ్యాక్సినేషన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ సృజన మాట్లాడుతూ, 9 నుంచి 14 ఏళ్ల బాలికలకు నూఎ టీకా వేయించడం ద్వారా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను సమర్థవంతంగా నివారించవచ్చని తెలిపారు. టీకా పూర్తిగా సురక్షితమని, తల్లిదండ్రులు ఎలాంటి అపోహలు లేకుండా తమ కుమార్తెలకు టీకా వేయించాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రతినిధి జోసఫ్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడం నేటి అవసరమని, ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందిస్తాయని అన్నారు. పాఠశాలకు విచ్చేసి హెచ్‌పీవీ



వ్యాక్సిన్ ప్రాముఖ్యతను వివరించిన వైద్యాధికారులు, ఆరోగ్య శాఖ సిబ్బందికి ఆల్ సెయింట్స్ మోడల్ హైస్కూల్ తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ సుజాత, ఏఎన్ఎం శ్వేత, ఆశా వర్కర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



## వైభవంగా మహంకాళి బోనాల ఉత్సవాలు

### ప్రత్యేక పూజలు నిర్వహించిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

**సికింద్రాబాద్ :** భాగ్యనగర్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ మారేడ్‌పల్లిలోని మల్కాజ్‌గిరి జోనల్ కమిషనర్ కార్యాలయ ఆవరణలో ఉన్న శ్రీ దుర్గా ఎల్లమ్మ దేవస్థానంలో మహంకాళి బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అమ్మవారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, సిరిసంపదలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా భాగ్యనగర్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు శ్యామ్ రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రకాశ్ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం యూనియన్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో మహంకాళి బోనాల ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మున్సిపల్ సిబ్బంది, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.



జేబీఎస్ నుంచి శామీర్ పేట్ రింగ్ రోడ్డు వరకు నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్ రోడ్డు నిర్మాణానికి ( రాజీవ్ రహదారిపై ) 2,264 చదరపు గజాల స్థలాన్ని ఇచ్చిన అల్వాల్ భూ నిర్వాసితులకు డీ.ఆర్.ఓ మాలతితో కలిసి అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ రూ. 33 కోట్ల నష్టపరిహార నిధుల చెక్కులను అందజేస్తున్న దృశ్యం...
– మేడ్చల్



## భక్తిశ్రద్ధలతో బోనాల జాతర

**సికింద్రాబాద్ :** ఆషాఢ మాస బోనాల జాతర సందర్భంగా కంటోన్మెంట్‌లో ప్రసిద్ధి చెందిన బొల్లారం తోట ముత్యాలమ్మ ఆలయం భక్తజన సందోహంతో కళకళలాడింది. ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తులు అమ్మవారికి సంప్రదాయబద్ధంగా బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమానికి కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ ముఖ్య అతిథిగా హాజరై ఆలయంలో కొలువై ఉన్న అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులకు పాడి పంటలు బాగా పండాలని, ప్రజలంతా సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. బోనాల జాతరను పురస్కరించుకుని ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడగా, అమ్మవారి దర్శనం కోసం పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్, విశ్వనాథ్, విజయ్, ఆలయ పూజారి పాల్గొన్నారు.

# పరిశుభ్రతకు దూరమైన పాఠశాల ఆవరణ

**బిజినపల్లి, వట్టెం, ఆగస్టు 5(జనం వార్త ):** వట్టెం గ్రామంలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రాంగణంలో చెత్తాచెదారం, కలుపు మొక్కలు పేరుకుపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాల ఆవరణలో చెత్తను తొలగించకుండా వదిలేయడంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. వర్షాకాలం కావడంతో కలుపు మొక్కలు విస్తరించి, చెత్త పేరుకుపోవడం వల్ల దోమలు, ఈగలు, విషపురుగులు, పాములు సంచరించే ప్రమాదం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ వందలాది మంది విద్యార్థినులు ఇదే ప్రాంగణంలో తిరుగుతున్న నేపథ్యంలో వారి ఆరోగ్యానికి ముప్పు ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. వారి మూత్రశాలలు కూడా పరిశుభ్రంగా లేకపోవడం వలన వారు అనారోగ్యానికి గురి అయ్యే అవకాశాలున్నాయి. పాఠశాలలు విద్యార్థులకు విద్యతో పాటు పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణాన్ని కల్పించాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పాఠశాల ఆవరణలోని చెత్తాచెదారాన్ని తొలగించి, కలుపు మొక్కలను శుభ్రం చేయించి పరిశుభ్రత చర్యలు చేపట్టాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు కోరుతున్నారు.









## హిందూ దేవుళ్లను కించపరుస్తున్న ప్రకాశ్ రాజ్

### సైబర్ డిజికి భాను ప్రకాశ్ తదితరుల ఫిర్యాదు

**అమరావతి,ఆగస్ట్5 :** హిందూ దేవుళ్లపై సోషల్ మీడియాలో పోస్ట్‌లు, నటుడు ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యలపై సైబర్ డీజీ రవిశంకర్‌కు బీజేపీ నేతల బృందం ఫిర్యాదు చేసింది. 57 మంది వివరాలతో బీజేపీ నేతలు భానుప్రకాశ్ రెడ్డి, వల్లూరు జయప్రకాష్, షేక్ బాజీ, శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా టీటీడీ బోర్డు సభ్యులు భానుప్రకాశ్ మాట్లాడుతూ.. భారత సంస్కృతిలో శ్రీరామచంద్రుడిని ఆరాధ్య దైవంగా చూశామని.. దేవతా మూర్తులు మాతా సరస్వతి, లక్ష్మీదేవి గాని, సీతమ్మను తల్లిగా భావిస్తున్నామని తెలిపారు. హిందూ దేవుళ్లపై అనరాని మాటలు అంటున్నారని భాను ప్రకాశ్ మండిపడ్డారు. ఈ వీడియోలను చూడలేకపోయామన్నారు. హిందూ దేవుళ్లను ఇష్టానుసారంగా మాట్లాడటం సరికాదన్నారు. 'ఒళ్లు జాగ్రత్త, తోలు తీస్తాం జాగ్రత్త! వదిలే ప్రసక్తే లేదు!' అని హెచ్చరించారు. హిందూ దేవుళ్లపై ప్రకాశ్ రాజ్ నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. శ్రీరామచంద్రుడు ఉత్తర దేశం నుంచి దక్షిణ దేశానికి వచ్చారని, పండ్లు దొంగిలించారని చెబుతున్నారని ఫైర్ అయ్యారు. దమ్ము, ధైర్యం ఉంటే అన్యమతస్తుల్లో జరుగుతున్న అన్యాయాల గురించి మాట్లాడాలని సవాల్ విసిరారు. కేవలం హిందూ మతం, హిందూ దేవుళ్లపై ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని.. ఇటువంటి వారిని కఠినంగా శిక్షించాలని భానుప్రకాశ్ రెడ్డి డిమాండ్ చేశారు.

## రసాయన పరిశ్రమలో ప్రమాదం

### ముగ్గురు యువకుల దుర్మరణం

### ఒకరు నారాయణపేట జిల్లా వ్యక్తిగా గుర్తింపు

**రాయచూర్, ఆగస్ట్ 5 :** కర్ణాటక యాద్గిర్ జిల్లాలోని ఓ రసాయన పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో తెలంగాణ యువకుడు సహ ముగ్గురు యువకులు మరణించారు. మరో ఇద్దరు తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. విషవాయువులు విడుదల కావడంతో బుధవారం తెల్లవారు జామున ఒంటి గంట నుంచి 2 గంటల మధ్యలో ఈ ప్రమాదం జరిగింది. ఫ్యాక్టరీలోని విషవాయువులు లీకవ్వడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. విషవాయువులు లీకవ్వడంతో ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ఐదుగురు కార్మికులు ఒక్కసారిగా అస్వస్థతకు గురవ్వడంతో వారిని రాయచూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్)కు తరలించారు. అయితే అప్పటికే ముగ్గురు మృతి చెందినట్లుగా వైద్యులు గుర్తించారు. మృతులను తెలంగాణ లోని నారాయణపేట జిల్లా కృష్ణ మండలం ఆలంపల్లికి చెందిన గణెళిశ్, మధ్యప్రదేశ్‌లోని కట్నీ జిల్లాకు చెందిన విక్రమ్, సంజయ్‌లుగా గుర్తించారు. వీరంతా 20 నుంచి 25 ఏళ్లలోపు వారేనని అధికారులు తెలిపారు. ఇక ఈ ఘటనలో ఏపీలోని అనంతపురం జిల్లాకు చెందిన హేమంత్, శివకుమా ర్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ప్రస్తుతం వారు ఆస్పత్రిలో చికిత్స పొందు తుండగా.. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాదంపై సమాచారం అందుకున్న యాద్గిర్ జిల్లా ఎస్పీ పృథ్విక్ శంకర్ ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదం ఎలా జరిగిందనే దానిపై దర్యాప్తు చేపట్టారు.



## జగన్‌పై అవినీతి కేసులపై రాజ్యసభలో టిడిపి ప్రస్తావన

### 13 ఏళ్లవుతున్నా తేలడం లేదంటూ ఎంపి విజయ్ వెల్లడి

### సుప్రీం జడ్జిల బిల్లుపై చర్చలో ప్రస్తావనను ఆక్షేపించిన డిప్యూటి ఛైర్మన్

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 5 :** పార్లమెంట్, రాజ్యసభలో ప్రతిపాదించిన 'సుప్రీంకోర్టు న్యాయమూర్తుల (సవరణ) బిల్లు - 2026'పై మాట్లాడే క్రమంలో జగన్ కేసుల విషయాన్ని తెలుగుదేశం పార్టీ ఎంపీ చింతకాయల విజయ్ ప్రస్తావించారు. దాదాపు కొన్నేళ్లుగా కేసుల విషయంలో జరుగుతున్న జాప్యాన్ని ప్రస్తావించారు. సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను 33 నుంచి 37కు పెంచడం సకాలంలో తీసుకున్న అభినందనీయమైన నిర్ణయమని పేర్కొన్నారు. సత్వర న్యాయం అందించే దిశగా ఈ-కోర్టులు, ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీని, అమరావతిలో జ్యుడీషియల్ మౌలిక వసతుల కల్పనకు విశేష కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్‌ను ఎంపీ విజయ్ సభలో ప్రముఖంగా ప్రశంసించారు. చట్టం ముందు సామాన్యులైనా, అత్యంత బలవంతులైనా సమానులేనని, న్యాయం ఆలస్యం అవడమంటే న్యాయం నిరాకరించినట్లేనని ఎంపీ విజయ్ స్పష్టం చేశారు. ఇదే సందర్భంలో ఏపీ మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసులను ఆయన రాజ్యసభ సాక్షిగా ప్రస్తావించారు. జగన్‌పై 2013లో నమోదైన సీబీఐ, ఈడీ కేసులు 13 ఏళ్లు గడుస్తున్నా విచారణ ముందుకు సాగలేదని ప్రశ్నించారు. డిశ్చార్జ్ పిటిషన్లు, న్యాయమూర్తుల బదిలీల సాకుతో ఉద్దేశపూర్వకంగానే జాప్యం చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా సకాలంలో విచారణ జరగాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సుదీర్ఘ జాప్యాల వల్ల న్యాయవ్యవస్థపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లుతుందని ఎంపీ విజయ్ కుండబద్దలు కొట్టారు. అయితే డిప్యూటి ఛైర్మన్ ఈ వ్యాఖ్యల ప్రస్తావనను ఆక్షేపించారు. బిల్లుపై మాత్రమే మాట్లాడాలని అన్నారు. భారత జనాభా 150 కోట్లకు చేరుకున్న ప్రస్తుత తరుణంలో, సామాన్యులకు సైతం వేగంగా, పారదర్శకంగా న్యాయం అందాలన్నదే తమ ఆకాంక్ష అని ఎంపీ విజయ్ తెలిపారు. ఈ వ్యవస్థపై ప్రజలకు పూర్తి భరోసా కలగాలంటే కేవలం అత్యున్నత న్యాయస్థానంతో పాటు హైకోర్టులు, కిందిస్థాయి కోర్టులు, ముఖ్యంగా ప్రత్యేక సీబీఐ కోర్టులను సైతం ఏకకాలంలో బలోపేతం చేసి తీర్పులు వేగవంతం చేయాలని ఎంపీ చింతకాయల విజయ్ డిమాండ్ చేశారు.

# పాఠశాలకు కేటాయించిన స్థలంపై కబ్జాదారుల కన్ను...!

- వివాదంలో ఎల్లమ్మబండ పాఠశాల స్థలం
- రెవెన్యూ,విద్యాశాఖల మధ్య సమన్వయ లోపం
- కాగితాలపైనే భూమి బదిలి... భౌతికంగా అప్పగించలేదు
- అవకాశాన్ని అనుకూలంగా మార్చుకుంటున్న కబ్జాదారులు
- ప్రధాన రోడ్డుకు ఆనుకొని కోట్ల విలువైన స్థలం
- ప్రశ్నార్థకంగా మారిన 1200 మంది నిరుపేద విద్యార్థుల భవిష్యత్తు



" తాంబూలాలు ఇచ్చాం తన్నుకు చావండి " అన్న విధంగా ఉంది రెండు ప్రభుత్వ శాఖల నిర్లక్ష్యపు పనితీరు. రెండు ప్రభుత్వ శాఖల పనితీరు వల్ల 1200 మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. పాఠశాల నిర్మాణం స్థలం కేటాయించామని రెవెన్యూ శాఖ అధికారులు ప్రకటనలు చేస్తుంటే... కాగితాల వరకే ప్రభుత్వ భూమి తమకు బదిలీ అయిందని, భౌతికంగా అప్పగించలేదని విద్యాశాఖ అధికారు లు ఆరోపిస్తున్నారు. ఈ రెండు శాఖల సమన్వయ లోపం వల్ల రెండు పిల్లులు ఒక రొట్టె ముక్క, ఒక కోతి కథ మాదిరిలా... ఈ సమస్యలోకి కొందరు కబ్జాదారులు ఈ ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఎల్లమ్మబండలో ప్రభుత్వ పాఠశాల నిర్మాణం కోసం కేటాయించిన స్థల సమస్యపై జనం వార్త ప్రత్యేక కథనం.




**కూకట్‌పల్లి, ఆగష్టు 5, (జనం వార్త) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్ కాలనీ సర్కిల్ ఎల్లంమబండలో అత్యధికంగా నిరుపేద, మధ్యతరగతి ప్రజలే నివాసం ఉంటున్నారు. ఎల్లమ్మ బండ తో పాటు చుట్టుపక్కల ఉన్న చిన్న చిన్న కాలనీలలో సైతం నిరుపేద కుటుంబాలే అత్యధికంగా నివాసం ఉంటుండడంతో ఆ పేద కుటుంబాల పిల్లలకు ఎల్లమ్మ బండ ప్రభుత్వ పాఠశాలనే దిక్కైంది. దీంతో ఈ పాఠశాలలో చేరే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. విద్యార్థులకు తరగతి గదులు సరిపోకపోవడంతో ఇరుకు గదుల్లోనే విద్యాబోధన చేయలేక పాఠశాల ఆవరణలో సైతం విద్యార్థులకు ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారు. ఈ పాఠశాలలో ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు విద్యార్థులకు ఉపాధ్యాయులు విద్యాబోధన నిర్వహిస్తున్నారు. ప్రీ ప్రైమరీ నుండి పదవ తరగతి వరకు నిర్వహిస్తున్న ఈ పాఠశాలలో 1200 మంది పేద విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 1200 మంది విద్యార్థులు విద్యనభ్యసించడానికి సరైన వసతులు లేక ఇరుకు గదులతో,అరకొర మౌలిక వసతుల తో పాఠశాల సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తరగతి గదులు సరిపోకపోవడంతో కొన్ని తరగతులను ఆవరణలోనే నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. కొత్త భవనం నిర్మిస్తే విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించే అవకాశం ఉంటుంది.

### నూతన భవనం నిర్మించాలని విద్యాశాఖకు వినతి

సుమారు 1,200 మంది విద్యార్థులు చదువుకుంటున్న ఈ పాఠశాలకు ప్రస్తుత భవనం సరిపోకపోవడంతో కొత్త భవనాన్ని నిర్మించాలని, విద్యార్థులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను తెలియజేస్తూ గత ప్రభుత్వాన్ని,అప్పటి విద్యాశాఖ అధికారులను ఉపాధ్యాయులు కోరారు. దీంతో 4.20 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించినప్పటికీ, నాలుగేళ్లు గడిచినా ఆ భూమిని విద్యాశాఖకు భౌతికంగా అప్పగించకపోవడంతో సమస్య మరింత జటిలంగా మారింది.

### కాగితాలపైనే భూమి బదిలీ... భౌతికంగా అప్పగించలేదు

కూకట్ పల్లి మండలం, కూకట్ పల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 336లో ఉన్న 4.20 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎల్లమ్మబండ ప్రభుత్వ పాఠశాల భవనం నిర్మాణం కోసం కేటాయిస్తూ అప్పటి మేడ్చల్ జిల్లా కలెక్టర్ కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం రెవెన్యూ అధికారులు 2022 డిసెంబర్ 17న విద్యాశాఖకు భూమిని అప్పగిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే కాగితాలపై మాత్రమే బదిలీ జరిగిందని, భౌతికంగా మాత్రం ఇప్పటికీ భూమిని విద్యాశాఖకు అప్పగించలేదని తెలుస్తోంది. విద్యాశాఖ అధికారులు స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు వెళ్లినప్పుడు, పక్కనే ఉన్న ఆలయం పేరుతో కొందరు అడ్డుకుంటున్నట్లు తెలుస్తోంది.

### కోట్ల విలువైన భూమిపై కబ్జాదారుల కన్ను

ఎల్లమ్మబండ ప్రభుత్వ పాఠశాలకు కేటాయించిన భూమి ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఉండటంతో కోట్ల విలువైన ప్రభుత్వ భూమిపై కొందరు ప్రైవేటు వ్యక్తులు కన్నేశారనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. పక్కనే ఉన్న ఆలయం పేరుతో కొందరు కబ్జాకు ప్రయత్నిస్తుండగా, మరో సర్వే నంబర్ పేరుతో మరి కొందరు భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకుని ప్రభుత్వ పాఠశాలకు కేటాయించిన భూమిని అప్పగించి, నూతన పాఠశాల భవన నిర్మాణానికి సహకరించాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు,స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ ఉన్నతాధికారులు ఏ విధంగా స్పందిస్తారో... చూడాలి. మరి.!!

- రాము సామల
939 939 6555

## డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో ఏపీ యువత భాగస్వామ్యం

### ఐబీఎం ఫ్యూచర్‌నౌ సెంటర్ తోడ్పాటు

### విశాఖలో సెంటర్‌ను ప్రారంభించిన మంత్రి లోకేశ్

**విశాఖపట్నం, ఆగస్ట్ 5 :** ప్రపంచ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో ఏపీ యువత భాగస్వామ్యం కావాలని మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ప్రపంచ దిగ్గజ ఐటీ సంస్థ ఐబీఎం నూతన ఐబీఎం కన్సల్టింగ్ ఫ్యూచర్ నౌ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ సేవలు, సాంకేతికత ఆధారిత ఆవిష్కరణలకు ప్రపంచ కేంద్రంగా విశాఖపట్నం ఆవిర్భవించడాన్ని ఐబీఎం ఫ్యూచర్‌నౌ సెంటర్ తోడ్పాటును అందిస్తోందన్నారు. సాంకేతిక పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు నాణ్యమైన ఉపాధిని సృష్టించడం, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న ప్రతిభను అభివృద్ధి చేయడం, ఏపీ యువత ప్రపంచ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో భాగమయ్యేలా చేసే ఒక సంపూర్ణ పర్యావరణ వ్యవస్థను నిర్మించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అన్నారు. ఆంధ్రప్రదేశ్ పట్ల ఐబీఎం చూపుతున్న నిరంతర నిబద్ధతను స్వాగతిస్తున్నామని చెప్పారు. ఏఐ, డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ కోసం విశాఖపట్నాన్ని భారతదేశంలోని అగ్రగామి కేంద్రాలలో ఒకటిగా తీర్చిదిద్దడానికి ఐబీఎం తో కలిసి పనిచేయడానికి ఎదురు చూస్తున్నామని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా కన్సల్టింగ్ సేవలు, ఏఐ ఫస్ట్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్టులకు మద్దతుగా ఐబీఎం కన్సల్టింగ్ ఫ్యూచర్‌నౌ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. భారతదేశ సాంకేతిక ఆవిష్కరణలు, ప్రతిభావంతులైన మానవ వనరుల అభివృద్ధిపై సంస్థ కొనసాగిస్తున్న పెట్టుబడులకు ఇది మరో కీలక ముందడుగు కానుంది. ఈ సెంటర్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఖాతాదారులకు కన్సల్టింగ్, సాంకేతిక సేవలను అందించనుంది. ఇందులో కృత్రిమ మేధస్సు, హైబ్రిడ్ క్లౌడ్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, డేటా అండ్ అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, ఎంటర్‌ప్రైజ్ ట్రాన్స్‌ఫర్మేషన్ వంటి కీలక రంగాల్లో సేవలు అందించనున్నారు. అదేవిధంగా ఏఐ ఆధారిత క్లౌడ్ ట్రాన్స్‌ఫర్మేషన్, ఎ÷-లాట్‌ఫార్మ్ ఇంజనీరింగ్, సర్వీస్ ఇంటిగ్రేషన్, క్వాలిటీ ఇంజనీరింగ్, యూజర్ ఎక్స్‌పీరియన్స్ సేవలకు ఐబీఎం కన్సల్టింగ్ ఫ్యూచర్‌నౌ సెంటర్ ప్రధాన కేంద్రంగా పనిచేయనుంది.



## ఏపీకి విదేశీ పెట్టుబడుల వెల్లువ

### లోక్‌సభలో వైసిపి సభ్యుడి ప్రశ్నకు కేంద్రం సమాధానం

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 5 :** ఆంధ్రప్రదేశ్‌కు విదేశీ పెట్టుబడుల ప్రవాహం కొనసాగు తోంది. లోక్‌సభలో లెక్కలతో సహా కేంద్రప్రభుత్వం స్పష్టం చేసింది. లోక్‌సభలో వైసీపీ ఎంపీ అడిగిన ప్రశ్నపై కేంద్రం వివరించింది. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో కంటే కూటమి ప్రభుత్వ పాలనలో భారీగా విదేశీ పెట్టుబడులు పెరిగాయని కేంద్రం తేల్చిచెప్పింది. 2023 - 24 ఆర్థిక సంవత్సరంలో రూ.760 కోట్లుగా (92.13 మిలియన్ డాలర్లు) ఎఫ్‌డీఐలు ఉన్నాయని వెల్లడించింది. 2024-25 నాటికి 233.14 మిలియన్ డాలర్లకు విదేశీ ఈక్విటీ పెట్టుబడులు పెరిగాయని పేర్కొంది. 2025 - 26 నాటికి ఏకంగా రూ.5,000 కోట్లకు పైగా (608.59 మిలియన్ డాలర్లు) ఎఫ్‌డీఐలు ఎగబాకినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. వైసీపీ హయాంలో పారిశ్రామిక విధానాల్లో అనిశ్చితి వల్ల పెట్టుబడుల ప్రవాహం వెనకబడిందని చెప్పింది. 2025-26లో లోహ పరిశ్రమల రంగంలో అత్యధికంగా 250.67 మిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలు వచ్చినట్లు స్పష్టం చేసింది. ఆహార శుద్ధి రంగంలో 107.30 మిలియన్ డాలర్లు, సిమెంట్ ఉత్పత్తుల రంగంలో 99.90 మిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు వచ్చాయని పేర్కొంది. సర్వీసెస్, ఆర్‌అండ్‌డీ పరిధిలోనూ 2025-26లో 59.96 మిలియన్ డాలర్ల పెట్టుబడులు నమోదైనట్లు వెల్లడించింది. కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన అనుకూల పారిశ్రామిక విధానాలు, 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'తో పెట్టుబడులు ఊపందుకున్నా యని కేంద్ర ప్రభుత్వం చెప్పింది. వైసీపీ పాలన కంటే కూటమి హయాంలో ఎఫ్‌డీఐల రీసౌండింగ్ గ్రోత్... 92 మిలియన్ డాలర్ల నుంచి ఏకంగా 608 మిలియన్ డాలర్లకు విదేశీ పెట్టుబడులు చేరాయని వివరించింది. సీఎం చంద్రబాబు బ్రాండ్ ఇమేజ్, వేగవంతమైన అనుమతులతో ఏపీ వైపు విదేశీ దిగ్గజ సంస్థలు క్యూ కడుతున్నాయని పేర్కొంది. లోహ, ఆహార శుద్ధి, సిమెంట్ రంగాల్లో భారీ పెట్టుబడులు వచ్చాయని కేంద్రం ప్రభుత్వం స్పష్టం చేసింది.

## సీమ తాగునీటి అవసరాలకు శ్రీశైలం నీరు

### నీటిని విడుదల చేసినట్లు వెల్లడించిన మంత్రి నిమ్మల

**అమరావతి, ఆగస్ట్ 5 :** రాయలసీమ తాగునీటి అవసరాల కోసం శ్రీశైలం నుంచి నీటిని విడుదల చేశామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. బుధవారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. ఎల్‌నినో నేపథ్యంలో 2027 జూన్ వరకు శ్రీశైలం జలాలను తాగునీటి కోసం భద్రపరచుకోవాలని అన్నారు. నేటికి శ్రీశైలం వద్ద ఉన్న 119 టీఎంసీలకు తోడు, రాబోయే 10 రోజులలో మరొక 100 టీఎంసీల వరకు ఇన్ ఫ్లో రావచ్చని అంచనా వేస్తున్నామన్నారు. కృష్ణా జలాల్లో ఏపీ 63 శాతం వాటాను ప్రథమంగా తాగునీటికే ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. శ్రీశైలం రిజర్వాయర్ నీటిని ఎల్‌నినో దృష్ట్యా ప్రథమ ప్రాధాన్యంగా తాగునీటికి విడుదల చేస్తున్నామని తెలిపారు. హంద్రీనీవా పరిధిలోని రిజర్వాయర్లకు తాగునీటి అవసరాల కోసం 13 టీఎంసీలు అవసరమని మంత్రి వెల్లడించారు. పోతిరెడ్డిపాడు పరిధిలోని రిజర్వాయర్లకు తాగునీటి కోసం10 టీఎంసీలను రేపటి నుంచి విడుదల చేస్తున్నట్లు చెప్పారు. అలాగే, తెలుగుగంగ ద్వారా చెన్నై తాగునీటికై 10 టీఎంసీల నీరు విడుదల చేయాల్సి ఉందన్నారు. నాగార్జున సాగర్, రైట్ కెనాల్, లెఫ్ట్ కెనాల్ పరిధి తాగునీటికి 32 టీఎంసీలు అవసరమన్నారు. వారం, వారం సమీక్ష చేసుకుని ఎల్‌నినో విపత్తును ఎదుర్కొనే విధంగా వర్షాలు, వరదల ఆధారంగా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడతామని తెలిపారు. జిల్లాల కలెక్టర్లు, ఇరిగేషన్, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయం చేసుకుంటూ నీటి భద్రతకు చర్యలు చేపట్టాలని మంత్రి నిమ్మల ఆదేశించారు.

## రౌడీయిజం ప్రదర్శించడమే రాజకీయమా?

### వైసిపి నేతల తీరుపై మండిపడ్డ మంత్రి సుభాష్

**అమరావతి, ఆగస్ట్ 5 :** రౌడీయిజాన్ని ప్రదర్శించడం వైసీపీ రాజకీయ సంస్కృతిగా మారిందని ఏపీ మంత్రి వాసంశెట్టి సుభాశ్ మండిపడ్డారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి వాసంశెట్టి సుభాశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ పర్యటనలో గొడ్డలి పార్టీ శ్రేణులు బస్సులు అడ్డుపెట్టి, సైలెన్సర్లు తొలగించి బలప్రదర్శన చేసి ప్రజలకు ఇబ్బందులు కలిగించాయని ధ్వజమెత్తారు. ఈరోజు (బుధవారం) అమరావతి వేదికగా మీడియాతో మంత్రి సుభాశ్ మాట్లాడారు. పొగాకు రైతుల సమస్యలపై మాట్లాడే నైతిక అర్హత జగన్‌కు లేదని చెప్పుకొచ్చారు. వైసీపీ హయాంలో కేవలం 12.9 మిలియన్ కిలోల హెచ్‌డీ బర్లీ పొగాకు కొనుగోలు జరిగిందని మంత్రి సుభాశ్ ప్రస్తావించారు. తమ ప్రభుత్వం 28.9 మిలియన్ కిలోల హెచ్‌డీ బర్లీ పొగాకును కొనుగోలు చేసి రైతులకు మద్దతుగా నిలిచిందని తెలిపారు. పొగాకు కొనుగోళ్ల ద్వారా రైతులకు సుమారు రూ.270 కోట్ల ఆర్థిక ప్రయోజనాన్ని తమ ప్రభుత్వం కల్పించిందని వెల్లడించారు. అంతర్జాతీయ మార్కెట్ ధరల పతనం, యుద్ధ పరిస్థితులు వంటి ప్రతికూల పరిస్థితుల్లో కూడా తమ ప్రభుత్వం రైతులకు అండగా ఉందని చెప్పుకొచ్చారు. కిలోకు రూ.10 ప్రోత్సాహక సాయం అందిస్తూ తమ ప్రభుత్వం సుమారు రూ.100 కోట్ల భారాన్ని భరిస్తోందని మంత్రి సుభాశ్ తెలిపారు. రైతులకు రూ.50 వేల వరకు వడ్డీలేని రుణాలు అందించే అంశంపై కేంద్రంతో చర్చలు జరుగుతున్నాయని అన్నారు. తమ ప్రభుత్వం సమస్యల పరిష్కారంపై దృష్టి పెడుతుంటే, జగన్ మాత్రం బలప్రదర్శనలు, రాజకీయ ఆరోపణలకే పరిమితమయ్యారని దుయ్యబట్టారు. ప్రజా సమస్యల కంటే రాజకీయ ప్రచారానికే గొడ్డలి పార్టీ ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి సుభాశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# అత్యంత ఆకర్షణీయమైన కంపెనీగా గూగుల్




దేశంలోనే అత్యంత ఆకర్షణీయమైన ఎంప్లా యర్ బ్రాండ్‌గా గూగుల్ అవతరించింది. ఈ జాబితాలో టాటా గ్రూప్, అమెజాన్ తర్వాతి స్థానాలను దక్కించుకున్నాయి. ఈ మేరకు హెచ్‌ఆర్ సేవల సంస్థ రాండ్‌స్టడ్ ఎంప్లాయర్ బ్రాండ్ రీసెర్చ్-2026 నివేదిక వెల్లడిం చింది. వర్క్-లైఫ్ బ్యాలెన్స్, సమానత్వం, ఆకర్షణీయ వేతనం వంటి ఇతర ప్రయోజ నాలను భారతీయ ఉద్యోగులు పరిగణనలోకి తీసుకుంటున్నట్లు పేర్కొంది. ఆర్‌ఈబీఆర్-26 జాబితా ప్రకారం.. శాంసంగ్ ఇండియా 4, ఇన్ఫోసిస్ 5, రిలయన్స్ ఇండస్ట్రీస్ 6, ఐటీసీ గ్రూప్ 7, హిందూస్థాన్ యునిలీవర్ 8, మహీంద్రా అండ్ మహీంద్రా 9, డెల్ టెక్నాలజీస్ లిమిటెడ్ 10వ స్థానాలను ఆక్రమించాయి. ప్రపంచవ్యాప్తంగా 34 మార్కెట్లు కవర్ చేస్తూ.. దాదాపు 1.75 లక్షల మందిపై ర్యాండ్‌స్టాడ్ ఈ సర్వే నిర్వహించింది. భారత్ నుంచి 3,500 మందికిపైగా సర్వేలో పాల్గొన్నారు. ఇందులో 46 శాతం మంది ఆరునెలల్లో ఉద్యోగాలు మారనున్నారు.







## రూ.299ప్లాన్‌కు ఎయిర్‌టెల్ గుడ్‌బై

ప్రముఖ టెలికాం సంస్థ ఎయిర్‌టెల్ రూ.299 విలువ కలిగిన ఎంట్రీ లెవల్ ప్రీపెయిడ్ రీఛార్జి ప్లాన్‌ను తొలగించింది. 28 రోజుల వ్యాలిడిటీతో అపరిమిత కాల్స్ డేటా అందించే ఈ ప్లాన్‌కు గుడ్‌బై చెప్పింది. ఎయిర్‌టెల్ వెబ్‌సైట్, ఎయిర్‌టెల్ థాంక్స్ యాప్ నుంచి ఈ ప్రీపెయిడ్ ప్లాన్‌ను తొలగించింది. ప్రారంభ ధర రీఛార్జి ప్లాన్ ధరలను సవరించిన ఏడాదికే ఎయిర్‌టెల్ ఈ మార్పును చేపట్టింది. దీంతోపాటు మరో రెండు ప్రీపెయిడ్ ప్లాన్‌లనూ ఎయిర్‌టెల్ తొలగించినట్లు తెలుస్తోంది. రూ.299 ప్లాన్‌తో 28 రోజుల వ్యాలిడిటీ, రోజుకు 1జీబీ డేటా, 100 ఎస్సెమ్మెస్‌లు, ఫ్రీ కాలర్ ట్యూన్స్, పెర్‌ప్లెక్సిటీ ప్రో ఏఐ సబ్‌స్క్రిప్షన్ వంటి ప్రయోజనాలు లభించేవి. ఇకపై రీఛార్జి చేయాలంటే అందుబాటులో ఉన్న ప్లాన్ ఒక్క రూ.349 మాత్రమే. ఈ ప్లాన్‌లో అపరిమిత కాల్స్‌తోపాటు రోజుకు 2జీబీ డేటా, 100 ఎస్సెమ్మెస్‌లు లభిస్తాయి. ఇది కూడా 28 రోజుల వ్యాలిడిటీతో వస్తోంది. ఆరు నెలల పాటు యాపిల్ మ్యూజిక్ సబ్‌స్క్రిప్షన్, ఫ్రీ హెలో ట్యూన్స్ లభిస్తాయి. ఎంట్రీ లెవల్ ప్లాన్‌తో పాటు రూ.579, రూ.619 విలువైన రీఛార్జి ప్లాన్‌లనూ ఎయిర్‌టెల్ తొలగించినట్లు తెలుస్తోంది. ఈ రెండు ప్లాన్లు కూడా ఎయిర్‌టెల్ వెబ్‌సైట్‌లో కనిపించడం లేదు. రూ.579 ప్లాన్ 56 రోజుల వ్యాలిడిటీ, రోజుకు 1.5 జీబీ డేటా లభిస్తుంది. ఇదే డేటా ప్రయోజనాలతో 60 రోజుల వ్యాలిడిటీతో రూ.619 రీఛార్జి ప్లాన్ అందిస్తూ వచ్చింది. తొలుత ఎంపిక చేసిన సర్కిళ్లలో తొలగించిన ఎయిర్‌టెల్.. తర్వాత మిగిలిన సర్కిళ్లలోనూ ఈ ప్యాక్స్‌ను తొలగించినట్లు తెలుస్తోంది.



## సీనియర్ ఆటగాళ్లను కాపాడుకోవాలి

**అజింక్య రహానే**

టెస్టు క్రికెట్ జట్టులో యువ ఆటగాళ్ల కంటే సీనియర్ ప్లేయర్లు ఎక్కువ మంది ఉండాలని అజింక్య రహానే అభిప్రాయపడ్డాడు. ఇటీవల అన్ని ఫార్మాట్ల క్రికెట్‌కు వీడ్కోలు పలికిన రహానే ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొని పలు విషయాల గురించి మాట్లాడాడు. టెస్టు క్రికెట్‌లో భారత్ పూర్వ వైభవం పొందాలంటే ప్రస్తుతం ఉన్న సీనియర్ ఆటగాళ్లను జట్టులో కొనసాగించాలన్నాడు. సీనియర్లు ఒకేసారి ఆటకు దూరమవుతుండటం టీమ్‌ఇండియాకు సమస్యగా మారిందని 'జింక్స్' పేర్కొన్నాడు. "గత రెండేళ్లుగా నేను టెస్టు క్రికెట్ ఆడకపోవడంతో ఇంట్లోనే కూర్చొని మ్యాచ్‌లు వీక్షించా. భారత జట్టు స్వదేశంలోనే మ్యాచ్‌లు ఓడిపోవడం కూడా చూశా. టెస్టు క్రికెట్ ఆడాలంటే పట్టుదల ఉండాలి. దాన్ని భారత ఆటగాళ్లు పెంపొందించుకుని పోటీతత్వంతో కూడిన క్రికెట్ ఆడాలి. ప్రతి సెషన్ పూర్తిగా ఆడాలి. చాలా జట్లు అలా చేయడం లేదు. నేను ఏ జట్టు గురించి ప్రత్యేకంగా చెప్పదల్చుకోలేదు. భారత టెస్టు క్రికెట్‌లోకి గత రెండేళ్లలో కొత్త ఆటగాళ్లు వచ్చారు. వారి సంగతి పక్కన పెట్టండి. టెస్టు జట్టులో 7-8 మంది సీనియర్లు, ఇద్దరు లేదా ముగ్గురు యువ ఆటగాళ్లు ఉండాలనేది నా అభిప్రాయం. కానీ, ఇప్పుడు జట్టు కొత్త వాళ్లతో నిండిపోతోంది. దాదాపుగా సీనియర్ ఆటగాళ్లంతా రిటైర్ అయ్యారు. మిగిలిన అనుభవజ్ఞులైన ఆటగాళ్లను గౌరవించడం చాలా అవసరం. నిజం చెప్పాలంటే టెస్టు క్రికెట్ గురించి నాకు భయంగా ఉంది. ఇది మనుగడ సాగించాలని మనందరం కోరుకోవాలి. ముఖ్యంగా భారత్, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, సౌతాఫ్రికాల్లో టెస్టు క్రికెట్ కొనసాగాలి" అని రహానే వివరించాడు. గతేడాది రవిచంద్రన్ అశ్విన్, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, ఛతేశ్వర్ పుజారా వంటి అనుభవజ్ఞులైన ఆటగాళ్లు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. తాజాగా రహానే కూడా రిటైర్మెంట్ ప్రకటించడంతో జట్టులో సీనియర్ల సంఖ్య తగ్గిపోయింది. ప్రస్తుతం భారత జట్టులో రవీంద్ర జడేజా, కేఎల్ రాహుల్, రిషభ్ పంత్, జస్‌ప్రీత్ బుమ్రా మాత్రమే 50 కంటే ఎక్కువ టెస్టులు ఆడారు.

## భారత చీఫ్ సెలెక్టర్‌గా వీవీఎస్ లక్ష్మణ్!?

**అజిత్ అగార్కర్‌పై వేటుపడే అవకాశం**



భారత క్రికెట్ పురుషుల సెలెక్షన్ కమిటీ చీఫ్ సెలెక్టర్‌గా మళ్లీ తెలుగు వ్యక్తి బాధ్యతలు చేపట్టబోతున్నాడా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. టీమిండియా దిగ్గజ క్రికెటర్, తెలుగు తేజం, సొగసరి బ్యాటర్ వీవీఎస్ లక్ష్మణ్ చీఫ్ సెలెక్టర్ పదవి రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. టీమిండియా వరుస పరాజయాల నేపథ్యంలో ప్రస్తుత చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌పై వేటు పడే అవకాశం ఉంది. అతని కాంట్రాక్ట్‌ను పొడిగించేందుకు బీసీసీఐ సుముఖంగా లేదని ఓ సీనియర్ స్పోర్ట్స్ జర్నలిస్ట్ సోషల్ మీడియా వేదికగా ఓ కథనాన్ని రాయడం తీవ్ర చర్చనీయాంశమైంది. 'భారత చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ పదవి ప్రమాదంలో పడింది. అతన్ని కొనసాగించేందుకు బీసీసీఐ సుముఖంగా లేదు. భారత నయా చీఫ్ సెలెక్టర్ పదవి రేసులో వీవీఎస్ లక్ష్మణ్ ముందంజలో ఉన్నారు. వీవీఎస్ లక్ష్మణ్ ఎంట్రీతో అజిత్ అగార్కర్‌కు ఉద్వాసన తప్పేలా లేదు. ప్రస్తుతం ఈ వ్యవహారం చర్చల దశలోనే ఉంది. సెప్టెంబర్‌లో జరిగే బీసీసీఐ వార్షిక సర్వసభ్య సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనున్నారు. లక్ష్మణ్ చీఫ్ సెలెక్టర్‌గా ఉంటే అతని మాటలకు విలువ ఉంటుందని, రోహిత్, విరాట్ కోహ్లీ వంటి ఆటగాళ్లు కూడా అతని సలహాలు పాటిస్తారని బీసీసీఐ అధికారులు భావిస్తున్నారు. ఇటీవల టీమ్ సెలెక్షన్ విషయంలో అగార్కర్ తీసుకున్న కొన్ని నిర్ణయాలపై ప్రశ్నలు తలెత్తాయి. 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకొని అగార్కర్‌ను కొనసాగించాలా? లేక లక్ష్మణ్‌ను తీసుకురావాలా?అనేది బీసీసీఐ బేరిజు వేస్తోంది. శ్రీలంకతో రెండు టెస్టుల సిరీస్ ఫలితంపైనే ఈ నిర్ణయం ఆధారపడి ఉంది. ఒకవేళ భారత్ ఈ సిరీస్‌ను గెలిస్తే.. అగార్కర్ పదవీకాలం పొడిగించవచ్చు. రోహిత్ శర్మ రిటైర్మెంట్ వార్తలపై కూడా బీసీసీఐ పెద్దలు ఆగ్రహంగా ఉన్నారు. సెక్రటరీ దేవజిత్ సైకియా వచ్చి వివరణ ఇవ్వాల్సి వచ్చింది. ప్రస్తుతం భారత జట్టును నడిపిస్తున్న వారికి రోహిత్ శర్మ జట్టులో కొనసాగడం ఇష్టం లేదు.

## గంభీర్ ఒక్కడినే విమర్శించడం సరికాదు

**మాజీ చీఫ్ సెలక్టర్ సందీప్ పాటిల్**



గౌతమ్ గంభీర్ హెడ్ కోచ్‌గా వచ్చినప్పటి నుంచి టీమ్‌ఇండియా పరిమిత ఓవర్ల క్రికెట్‌లో మంచి ఫలితాలే సాధిస్తోంది. టెస్టుల్లో మాత్రం పేలవ ప్రదర్శన చేస్తోంది. స్వదేశంలో న్యూజిలాండ్, సౌతాఫ్రికాతో జరిగిన సిరీస్‌ల్లో ఘోర ఓటములను మూటగట్టుకుంది. ఈ ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో భారత్ తొమ్మిది మ్యాచ్‌లు ఆడి నాలుగు విజయాలు, నాలుగు ఓటములతో పాయింట్ల పట్టికలో ఐదో స్థానంలో ఉంది. గంభీర్ ఒంటెద్దు పోకడల వల్లే టెస్టుల్లో భారత్ పేలవ ప్రదర్శన చేస్తోందని విమర్శలు వస్తున్నాయి. త్వరలో శ్రీలంకతో జరగనున్న రెండు టెస్టుల సిరీస్ గంభీర్‌కు అగ్నిపరీక్షగా మారింది. ఒకవేళ ఈ సిరీస్ కూడా కోల్పోతే అతనిపై వేటు పడే అవకాశాలు లేకపోలేదు. ఇలాంటి తరుణంలో గంభీర్‌కు మాజీ చీఫ్ సెలక్టర్ సందీప్ పాటిల్ మద్దతుగా నిలిచాడు. జట్టు వైఫల్యాన్ని ఒక్క వ్యక్తిపైనే మోపలేమన్నాడు. "శ్రీలంక పర్యటన అందరికీ కీలకం. కేవలం గంభీర్‌నే ఎందుకు టార్గెట్ చేస్తున్నారు? అతను మంచి ఫలితాలు తేవడంలో విఫలమైతే ఆటగాళ్లు కూడా విఫలమైనట్లే. ఒక్కరినే విమర్శించడం సరికాదు. మన ఆటగాళ్లు స్పిన్నర్లను ఎదుర్కోలేకపోయారు. అందుకే న్యూజిలాండ్‌తో స్వదేశంలో సిరీస్ ఓడిపోయాం. అంతేకాకుండా కివీస్ ఆటగాళ్లు పూర్తి సన్నద్ధతతో ఇక్కడికి వచ్చారు. వారు స్పిన్‌కు అనుకూలమైన వికెట్లపై ప్రాక్టీస్ చేశారు. టీమ్‌ఇండియా మాత్రం బ్యాటింగ్, బౌలింగ్‌కు అనుకూలించే పిచ్‌లపై ప్రాక్టీస్ చేసింది. అదే భారత జట్టుకు ప్రతికూలంగా మారింది. అందుకే ఓటములను చవిచూసింది" అని సందీప్ పాటిల్ పేర్కొన్నాడు. 2007-2008 మధ్య టీమ్‌ఇండియాకు తాత్కాలిక కోచ్‌గా వ్యవహరించిన లాల్‌చంద్ రాజ్‌పుత్ కూడా గంభీర్‌కు అండగా నిలిచాడు. కోచ్ అన్నాక ఒడుదొడుకులు సహజమని, ప్రతిసారీ గెలవలేమని పేర్కొన్నాడు. ప్రస్తుతం భారత జట్టు పరివర్తన దశలో ఉందని.. ఇలాంటి సమయంలో ఆటగాళ్లకు, కోచ్‌కు తగినంత సమయం ఇవ్వాలన్నాడు. రోహిత్, కోహ్లీ వంటి దిగ్గజాలు రెండు ఫార్మాట్ల నుంచి తప్పుకోవడం కూడా టీమ్‌ఇండియాపై ప్రభావం చూపిస్తోందని లాల్‌చంద్ రాజ్‌పుత్ అన్నాడు. ఆగస్టు 15 నుంచి శ్రీలంకతో భారత్ రెండు టెస్టుల సిరీస్‌లో తలపడనుంది. ఇప్పటికే టీమ్‌ఇండియా శ్రీలంకకు చేరుకుంది.

## 2027 వన్డే ప్రపంచకప్ షెడ్యూల్ ప్రకటించిన ఐసీసీ

**ఫిబ్రవరి 22 నుంచి మార్చి 23 వరకు మ్యాచ్‌లు**




వచ్చే ఏడాది సౌతాఫ్రికా వేదికగా జరగనున్న ప్రతిష్టాత్మక 2027 వన్డే ప్రపంచకప్ టోర్నమెంట్‌కు సంబంధించి ఐసీసీ ఒక కీలక అప్‌డేట్ ఇచ్చింది. ఈ టోర్నీకి అర్హత సాధించేందుకు నిర్వహించే క్వాలిఫైయర్స్ మ్యాచ్‌ల తేదీలను ఐసీసీ అధికారికంగా ప్రకటించింది. 10 జట్లు పాల్గొనే ఈ క్వాలిఫైయర్ రౌండ్ 2027 ఫిబ్రవరి 22 నుంచి మార్చి 23 మధ్య జరగనుంది. అయితే ఈ మ్యాచ్‌లను ఏ దేశంలో లేదా ఏ వేదికల్లో నిర్వహిస్తారనే దానిపై ఐసీసీ ఇంకా ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు. ఈసారి జరగబోయే వన్డే ప్రపంచకప్‌ను ఐసీసీ సరికొత్త ఫార్మాట్‌లో నిర్వహించబోతోంది. ఈ మెగా టోర్నీలో మొత్తం 14 జట్లు పోటీపడనున్నాయి. క్వాలిఫైయర్‌లో గెలిచిన టాప్ టీమ్ నేరుగా ఈ 14 జట్ల ప్రధాన గ్రూప్‌లో చోటు దక్కించుకుంటుంది. ఇక క్వాలిఫైయర్స్ పాయింట్ల పట్టికలో రెండు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచే జట్ల మధ్య సూపర్ సిరీస్ పోరు జరుగుతుంది. ఇది ప్రపంచకప్ మొదటి రౌండ్‌గా పరిగణించబడుతుంది. ఈ రౌండ్‌లో విజయం సాధించిన జట్లు ఆ తర్వాత టాప్-12 లోకి అడుగు పెడతాయి. ఈసారి వన్డే ప్రపంచకప్ టోర్నమెంట్ మూడు ఆఫ్రికన్ దేశాల ఉమ్మడి ఆతిథ్యంలో జరగనుంది. సౌతాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు కలిసి ఈ టోర్నీని నిర్వహించనున్నాయి. టోర్నీలోని మొత్తం మ్యాచ్‌లను 12 వేర్వేరు స్టేడియంలలో నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

## పాకిస్థాన్ ఘనవిజయం

**117 పరుగులకే కుప్పకూలిన విండీస్**

**సిరీస్ 1-1తో సమం**



పోర్ట్ ఆఫ్ స్పెయిన్: వెస్టిండీస్‌తో తొలి టెస్టులో మంచి స్థితి నుంచి తడబడి ఓటమి కొని తెచ్చుకున్న పాకిస్థాన్.. రెండో టెస్టులో గొప్పగా పుంజుకుని, 8 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. రెండు టెస్టుల సిరీస్‌ను ఆ జట్టు 1-1తో డ్రాగా ముగించింది. తొలి ఇన్నింగ్స్‌లో 43 పరుగుల ఆధిక్యం సాధించిన పాక్.. రెండో ఇన్నింగ్స్‌లో విండీస్‌ను 117 పరుగులకే కుప్పకూల్చి విజయానికి బాటలు వేసుకుంది. అనంతరం 75 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన ఆ జట్టు.. 2 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. ఓపెనర్లు ఇమాముల్ హక్ (9), అజాన్ అవైస్ (18) త్వరగా ఔటైనప్పటికీ.. తొలి ఇన్నింగ్స్ హీరోలు అబ్దుల్లా షఫీక్ (24), బాబర్ అజామ్ (24) అజేయంగా నిలిచి విజయాన్ని పూర్తి చేశారు. అంతకుముందు రెండో ఇన్నింగ్స్‌లో ఆతిథ్య విండీస్ తేలిపోయింది. స్పిన్నర్లు సాజిద్ ఖాన్ (4/32), అలీ ఉస్మాన్ (4/39)ల ధాటికి విలవిలలాడి వంద పైచిలుకు స్కోరుకే ఇన్నింగ్స్‌ను ముగించింది. 34 పరుగులు చేసిన ఓపెనర్ కవెమ్ హాడ్జ్ టాప్‌స్కోరర్. మరో ఓపెనర్ త్యాగ్‌నారాయణ్ చందర్‌పాల్ (17), కెప్టెన్ రోస్టన్ చేజ్ (17)లతో పాటు ప్రధాన బ్యాటర్లు అమీర్ జంగూ (13), షై హోప్ (15), జస్టిన్ గ్రీవ్స్ (3) తేలిపోయారు. తొలి ఇన్నింగ్స్‌లో విండీస్ 344 పరుగులకు ఆలౌట్ కాగా.. పాక్ 387 పరుగులు చేసింది. మాజీ కెప్టెన్ షాన్ మసూద్ గాయపడడంతో రెండో టెస్టుకు జట్టులోకి వచ్చిన అబ్దుల్లా షఫీక్ తొలి ఇన్నింగ్స్‌లో సూపర్ సెంచరీ చేశాడు. అతడికే 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. మసూద్ స్థానంలో ఇటీవలే మళ్లీ జట్టు పగ్గాలు అందుకున్న బాబర్ అజామ్.. తొలి టెస్టులో ఓటమి ఎదుర్కొన్నప్పటికీ, ఈ మ్యాచ్‌లో కీలక ఇన్నింగ్స్ ఆడడమే కాక, కెప్టెన్సీతోనూ ఆకట్టుకుని జట్టును గెలిపించాడు.



## యూపీఐ ఛార్జీలపై ఆర్‌బీఐ గవర్నర్ కీలక వ్యాఖ్యలు

యూపీఐ లావాదేవీలపై ఛార్జీల అంశంపై ఆర్‌బీఐ గవర్నర్ కీలక వ్యాఖ్యలు చేశారు. డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను బలోపేతం చేయాలంటే అందుకు అయ్యే ఖర్చును ఎవరో ఒకరు భరించాల్సిందేనని పేర్కొన్నారు. ద్వైమాసిక పరపతి విధాన సమీక్ష నిర్ణయాల ప్రకటన అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన.. యూపీఐ ఛార్జీల అంశంపై స్పందించారు. దీనిపై అప్పుడే మాట్లాడడం తొందరపాటే అవుతుందన్న ఆయన.. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సిన అవసరం ఉందన్నారు. యూపీఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ ఛార్జీలు విధించేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. దీనికి సంబంధించి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 'ద పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ యాక్ట్'లో సవరణలు ప్రతిపాదించారు. ఛార్జీల వివరాలూ ఇంకా ఖరారు కానప్పటికీ, ఈ సవరణ ద్వారా యూపీఐ వంటి చెల్లింపులపై ఎండీఆర్ విధించడానికి మార్గం సుగమం అవుతుంది. ఏ డిజిటల్ చెల్లింపు లావాదేవీలకు ఎండీఆర్ మినహాయింపు ఇవ్వాలనేది ప్రభుత్వం నోటిఫై చేస్తుంది. రూ.2వేలు పైబడిన లావాదేవీలపై ఎండీఆర్ రేటు 0.3% నుంచి 0.5% వరకు ఉండొచ్చని భావిస్తున్నారు. అయితే, ఈ ఛార్జీలు పెద్ద వ్యాపారులకు మాత్రమే వర్తిస్తాయి. లావాదేవీలను ప్రాసెస్ చేసినందుకుగాను వ్యాపారులు బ్యాంకులు, పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లకు చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతానికి ఈ ఛార్జీలను బ్యాంకులు, పేమెంట్ కంపెనీలు భరిస్తున్నాయి. సాధారణ వినియోగదారులు, చిన్న వ్యాపారులకు వర్తించవు. దీర్ఘకాలం మన్నిక ఇచ్చే పాలిమర్ కరెన్సీ నోట్లను వచ్చే ఆర్థిక సంవత్సరం ప్రారంభం నాటికి తీసుకురావాలని ఆర్‌బీఐ లక్ష్యంగా పెట్టుకుందని గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. ద్రవ్య విధాన సమీక్ష అనంతరం విలేకరులతో మాట్లాడిన ఆయన.. కొన్ని చోట్ల పాలిమర్ కరెన్సీ నోట్లు 30 ఏళ్లకు పైగా మన్నికగా నిలిచాయని చెప్పారు. ముఖ్యంగా ఎక్కువగా చలామణీ అయ్యే తక్కువ విలువ కలిగిన నోట్లకు ఇవి ఉపయుక్తంగా ఉంటాయని తెలిపారు.




## స్వల్ప లాభాల్లో ముగిసిన సూచీలు

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు స్వల్ప లాభాల్లో ముగిశాయి. పశ్చిమాసియాలో ప్రతికూల పరిస్థితులు, చమురు ధరలు పెరగడం మార్కెట్‌పై ప్రభావం పడింది. మరోవైపు, ఆర్‌బీఐ రెపో రేటు 5.25 శాతం వద్దే యథాతథంగా కొనసాగిస్తున్నట్లు ప్రకటించడంతో మదుపర్లు ఆచితూచి వ్యవహరించారు. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ స్టాక్స్ ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. దీంతో లాభనష్టాల్లో ఊగిసలాడిన సూచీలు ఆఖర్లో కొలుకుని లాభాల్లో ముగిశాయి. ఉదయం సెన్సెక్స్ 79,055.38 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 78,428.95) లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 79,055.38 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. ఆ తర్వాత నష్టాల్లోకి జారుకొని 78,285.74 పాయింట్ల వద్ద కనిష్ఠానికి పడిపోయింది. చివరికి సెన్సెక్స్ 152.05 పాయింట్లు లాభపడి 78,581 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 9.75 పాయింట్లు పెరిగి 24,624.65 పాయింట్ల వద్ద స్థిరపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.13 వద్ద ఉంది. సెన్సెక్స్ 30లో అల్ట్రాటెక్ సిమెంట్, ఎన్‌టీపీసీ, ఎస్‌బీఐ, మహీంద్రా అండ్ మహీంద్రా, ఇండిగో, కోటక్ బ్యాంక్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. టీసీఎస్, హెచ్‌సీఎల్‌టెక్, రిలయన్స్, బీఈఎల్, సన్‌ఫార్మా, హెచ్‌డీఎఫ్‌సీ షేర్లు నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 80.69 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,152.30 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.



## ప్యారడైజ్‌తో పోటీ పడనున్న దోరతి మూవీ

న్యాచురల్ స్టార్ నాని హీరోగా, కయాదు లోహర్ హీరోయిన్‌గా మాస్ డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న భారీ చిత్రం 'ది ప్యారడైజ్'. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత ఈ క్రేజీ కాంబినేషన్‌లో సినిమా వస్తుండటంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాను సెప్టెంబర్ 25న విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. అయితే, సరిగ్గా అదే తేదీన నానితో పోటీ పడేందుకు ఆయన 'దసరా' సహనటి కీర్తి సురేష్ సిద్ధమవుతుండటం ప్రస్తుతం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ప్రముఖ కోలీవుడ్ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ తెరకెక్కిస్తున్న 'దోరతి' చిత్రంలో కీర్తి సురేష్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. సంగీత మాంత్రికుడు ఇళయరాజా సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ ఇప్పటికే ప్రకటించింది.

# ఆదిపురుష్‌తో రామాయణను పోల్చవద్దు

## రామాయణ విజయం సాధించాలన్న మనోజ్

బాలీవుడ్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతోన్న చిత్రం 'రామాయణ'. ఈ సినిమా ట్రైలర్ విడుదలైన నాటి నుంచి వార్తల్లో నిలుస్తోంది. గతంలో వచ్చిన 'ఆదిపురుష్'తో ఈ చిత్రాన్ని పోలుస్తూ కొందరు పోస్టులు పెడుతున్నారు. తాజాగా ముంబయిలో జరిగిన ఓ కార్యక్రమంలో 'ఆదిపురుష్' రచయిత మనోజ్ దీనిపై మాట్లాడారు. 'రామాయణ'లో రావణుడి పాత్ర పోషించిన యశ్‌పై ప్రశంసలు కురిపించారు. యశ్ చాలా మంచి నటుడు. అందులో ఎలాంటి సందేహం లేదు. మన భారతీయ ఇతిహాసాన్ని ప్రపంచ వేదికపైకి తీసుకెళ్లే ఏ సినిమాకైనా నా పూర్తి మద్దతు ఉంటుంది. 'రామాయణ' మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నా. ఈ చిత్రాన్ని 'ఆదిపురుష్'తో పోల్చొద్దు. అది ప్రేక్షకుల అంచనాలను అందుకోలేపోయింది. ఆ సినిమా కోసం ప్రతి ఒక్కరూ ఎంతో కష్టపడ్డారు. అయితే, 'ఆదిపురుష్' సంగీతం మంచి ఆదరణ సొంతం చేసుకుంది. ఇప్పుడు రామాయణ మ్యూజిక్ కూడా హిట్ కావడం నాకు చాలా ఆనందంగా ఉంది' అని మనోజ్ తెలిపారు. రణ్‌బీర్ కపూర్ రాముడిగా కనిపించనున్న రామాయణ చిత్రం రెండు భాగాలుగా రానుంది. ఇప్పటికే రెండో భాగం కూడా 50 శాతం షూటింగ్ పూర్తయినట్లు రణ్‌బీర్ తెలిపారు. రామాయణ లాంటి గొప్ప కథను 10 భాగాలు తీయొచ్చని రెండు భాగాల్లోనే నితీశ్ తివారీ అద్భుతంగా తెరకెక్కిస్తున్నారని ప్రశంసించారు. దీపావళికి ఈ సినిమా మొదటి భాగం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.



# సందీప్ కిషన్ సరికొత్త చిత్రం కరికాల

యంగ్ హీరో సందీప్ కిషన్ తన కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. విభిన్న కథలను ఎంచుకుంటూ ప్రేక్షకులను అలరిస్తున్న ఆయన, ఇప్పుడు పీరియాడిక్ యాక్షన్ జానర్‌లోకి అడుగుపెడుతున్నారు. తాజాగా 'కరికాల' అనే భారీ చిత్రాన్ని అధికారికంగా ప్రకటిస్తూ మేకర్స్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. పోస్టర్ విడుదలైన వెంటనే సోషల్ మీడియాలో వైరల్‌గా మారి సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఇటీవలి కాలంలో పీరియాడిక్ కథలు, రాజుల చరిత్ర, యుద్ధ నేపథ్యంతో రూపొందుతున్న సినిమాలకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. అదే తరహాలో ఇప్పుడు సందీప్ కిషన్ కూడా ఓ భారీ పీరియాడిక్ కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. 'శంబాల' చిత్రంతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న యుగంధర్ ముని ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాను షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై మహీధర్ రెడ్డి, రాజశేఖర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో సందీప్ కిషన్ శక్తివంతమైన యోధుడి పాత్రలో కనిపిస్తున్నారు. చేతిలో కత్తి పట్టుకుని గుర్రంపై యుద్ధానికి దూసుకెళ్తున్న ఆయన లుక్ ఆకట్టుకుంటోంది. పోస్టర్‌లో ఆయన పక్కనే ఓ సింహం కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యుద్ధభూమి వాతావరణం, భారీ విజువల్స్, పవర్‌ఫుల్ లుక్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. పోస్టర్‌ను బట్టి చూస్తే, ఇది కేవలం యాక్షన్ సినిమా మాత్రమే కాకుండా చారిత్రక నేపథ్యంతో కూడిన ఎమోషనల్ సాగా కూడా కావచ్చని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ ప్రాజెక్ట్‌ను రెండు భాగాలుగా తెరకెక్కించనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. విడుదల తేదీలను కూడా అధికారికంగా వెల్లడించారు. 'కరికాల చాప్టర్ 1' : 2027 జూలై 2, 'కరికాల చాప్టర్ 2' : 2027 అక్టోబర్ 28 అంటే కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే రెండు భాగాలను విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేయడం విశేషం. ఇప్పటి వరకు సందీప్ కిషన్ ఎక్కువగా యాక్షన్, థ్రిల్లర్, కామెడీ, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రాల్లో కనిపించారు. అయితే 'కరికాల' తో తొలిసారి భారీ పీరియాడిక్ యాక్షన్ కథలో




నటిస్తున్నారు. అయితే సినిమా కథ, ఇతర నటీనటులు, సాంకేతిక బృందానికి సంబంధించిన పూర్తి వివరాలను మేకర్స్ త్వరలో వెల్లడించే అవకాశం ఉంది. ప్రస్తుతం 'సిగ్మా' విడుదల కోసం సందీప్ కిషన్ ఎదురు చూస్తున్నారు. విజయ్ కుమారుడు జేసన్ సంజయ్ ఈ సినిమాతో దర్శకుడిగా ఎంట్రీ ఇస్తున్నారు. జులై 31న 'సిగ్మా' విడుదల కావాల్సి ఉండగా కొన్ని కారణాల వల్ల ఇది వాయిదా పడింది.

# మిస్సింగ్ మేఘన.. ఫస్ట్‌లుక్ విడుదల

రామ్ కార్తీక్ హీరోగా, అమ్ము అభిరామి, వైదిక సెంజాలియా, అంకిత్ కొయ్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా సస్పెన్స్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ చిత్రం 'మిస్సింగ్ మేఘన'. ఫస్ట్ కాపీ మూవీస్ మరియు కేడి అండ్ కో బ్యానర్లపై పంచమర్తి నరేష్ బాబు నిర్మిస్తున్న ఈ చిత్రానికి వాచస్పతి దర్శకత్వం వహిస్తున్నారు. గోపరాజు రమణ, వెంప కాశి, కౌశిక్, మహిపాల్, రుచిత, నళిని, శ్రీనివాస్, అజీమ్, పండు తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ మరియు టైటిల్ రివీలింగ్ పోస్టర్ లాంచ్ కార్యక్రమం టాలీవుడ్ ప్రముఖ టెక్నీషియన్లు, సినీ ప్రముఖుల సమక్షంలో అత్యంత వైభవంగా జరిగింది. టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు వి.వి. వినాయక్ ఈ చిత్ర పోస్టర్‌ను తన చేతుల మీదుగా విడుదల చేసి సినిమా యూనిట్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్మాత బెక్కం వేణుగోపాల్‌తో పాటు చిత్ర బృందమంతా ఉత్సాహంగా పాల్గొంది. ఈ సందర్భంగా వి.వి. వినాయక్ మాట్లాడుతూ, బెక్కం వేణుగోపాల్, శ్రీనివాస్ ల సహకారంతో దర్శకుడు వాచస్పతి ఈ చిత్రాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారని తెలిపారు. ఈ సినిమాతో హీరో రామ్ కార్తీక్, దర్శకుడు వాచస్పతిలకు మంచి పేరు రావాలని, అలాగే సంగీతంతో పాటు పాటలు కూడా అందించే ఆల్ రౌండర్ ధ్రువన్‌కు ఈ చిత్రం ద్వారా మంచి గుర్తింపు దక్కాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు చెప్పారు. ఈ చిత్ర యూనిట్ మొత్తానికి ప్రేక్షకుల నుంచి అద్భుతమైన ఆదరణ లభించాలని ఆకాంక్షించారు. దర్శకుడు వాచస్పతి మాట్లాడుతూ, వి.వి. వినాయక్ గారిది గో÷–డలెన్ హ్యాండ్ అని, ఆయన చేతుల మీదుగా తమ సినిమా పోస్టర్ లాంచ్ కావడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. మీడియా సహకారంతో ప్రేక్షకుల ముందుకు వస్తున్న ఈ చిత్రం ఒక చక్కటి సస్పెన్స్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా ఉంటుందని, ప్రేక్షకులను అలరించే అన్ని



కమర్షియల్ హంగులు ఇందులో ఉన్నాయని తెలిపారు. అతి త్వరలోనే ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు ప్రకటించారు. హీరో రామ్ కార్తీక్ మాట్లాడుతూ, తమకు ఈ చిత్రంలో అవకాశం కల్పించిన దర్శకుడు వాచస్పతికి, నిర్మాత నరేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సినిమా ఖచ్చితంగా ప్రేక్షకులందరినీ అలరిస్తుందని నమ్మకం వ్యక్తం చేశారు. సంగీత దర్శకుడు ఆర్.ఆర్. ధ్రువన్ మాట్లాడుతూ, లెజెండ్రీ డైరెక్టర్ వి.వి. వినాయక్ చేతుల మీదుగా పోస్టర్ విడుదల కావడం తన కెరీర్‌లో మరువలేని క్షణమని, ఒక మంచి మ్యూజిషియన్‌కు కావాల్సిన అన్ని రకాల ఎమోషన్స్ ఈ సినిమాలో ఉన్నాయని వెల్లడించారు. ఈ చిత్రానికి శామ్ కె. నాయుడు సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరిస్తుండగా, వనరాజ్ కథ, స్క్రీన్‌ప్లే అందించారు.

# పాత్రలను తీర్చిదిద్దే విధానం ఇష్టం

కోలీవుడ్ యంగ్ హీరోయిన్ మాళవిక మోహనన్ తనదైన యాక్టింగ్, అందచందాలతో తెలుగు, తమిళ చిత్రసీమలో మంచి గుర్తింపు తెచ్చుకుంటూ వరుస ఆఫర్లతో దూసుకుపోతున్నారు. ప్రస్తుతం ఆమె వరుసగా భారీ యాక్షన్ సినిమాల్లో నటిస్తూ ఎంతో బిజీగా ఉన్నారు. కార్తి సరసన నటిస్తున్న 'సర్దార్–2'తో పాటు ప్రముఖ దర్శకుడు త్యాగరాజన్ కుమారరాజ దర్శకత్వంలో తెరకెక్కుతున్న క్రైమ్ డ్రామా చిత్రం 'పాకెట్ నావల్'లో హీరోయిన్‌గా నటించే అద్భుతమైన అవకాశాన్ని దక్కించుకున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ రెండు చిత్రాలు త్వరలోనే గ్రాండ్‌గా థియేటర్లలోకి వచ్చి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నాయి. అయితే మాళవిక మోహనన్ షూటింగ్‌లతో ఎంత బిజీగా ఉన్నప్పటికీ సోషల్ మీడియా వేదికగా ఎప్పుడూ ఎంతో యాక్టివ్‌గా ఉంటారు. తన సినిమాల షూటింగ్ విశేషాలను, అలాగే వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాలను ఎప్పటికప్పుడు అభిమానులతో పంచుకుంటూ ఉంటారు. తాజాగా ఆమె ట్విట్టర్ ద్వారా తన అభిమానులతో సరదాగా ఆస్క్ మీ ఎనీథింగ్ చిట్ చాట్ సెషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ అభిమాని ఇప్పటివరకు మీరు నటించిన సినిమాల్లో మీకు అత్యంత ఇష్టమైన పాత్ర ఏది అని ప్రశ్నించగా, దానికి మాళవిక చాలా ఆసక్తికరమైన సమాధానం ఇచ్చారు. ఇప్పటివరకు తాను చేసిన వాటిలో కేవలం ఒక్క పాత్రనే ఎంచుకోవడం తనకు చాలా కష్టమని చెబుతూనే, తన రాబోయే చిత్రాలలో తాను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న పాత్ర మాత్రం 'పాకెట్ నావల్'లోని జీవ పాత్ర అని వెల్లడించారు. దర్శకుడు త్యాగరాజన్ కుమారరాజ తన సినిమాల్లో పాత్రలను తీర్చిదిద్దే విధానం తనకు చాలా ఇష్టమని, పైగా ఈ జీవ పాత్ర తాను ఇప్పటివరకు పోషించిన పాత్రలన్నింటికీ చాలా భిన్నంగా ఉంటుందని చెప్పారు. అలాగే 'పాకెట్ నావల్' సినిమా సెట్స్‌లో దర్శకుడితో కలిసి దిగిన ఒక సరదా ఫోటోను షేర్ చేస్తూ, ఇది తమ సినిమా సెట్స్‌లో తీసుకున్న ఫోటో అని, తాను అనుకున్న దానికన్నా ఈ పిక్ చాలా విచిత్రంగా, ఫన్నీగా ఉందంటూ మాళవిక చెప్పారు.



# కొరియన్ కనకరాజు విడుదలకు సిద్ధం

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా నటించిన ఇండో–కొరియన్ హారర్ కామెడీ 'కొరియన్ కనకరాజు' విడుదలకు సిద్ధమైంది. దర్శకుడు మేర్లపాక గాంధీ తెరకెక్కించిన ఈ చిత్రంలో రితికా నాయక్ హీరోయిన్‌గా నటించగా, ప్రముఖ కమెడియన్ సత్య కీలక పాత్ర పోషించారు. ఆగస్టు 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా ఇప్పటికే సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలో సినిమా చూసిన వారి ఒపీనియన్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో ఆసక్తికరంగా మారాయి. ముఖ్యంగా కామెడీ, వరుణ్ తేజ్ నటన, థమన్ సంగీతం సినిమాకు ప్రధాన బలాలుగా నిలిచాయని టాక్ వినిపిస్తోంది. 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్', 'ఎక్స్‌ప్రెస్ రాజా' వంటి విజయవంతమైన కామెడీ చిత్రాలను తెరకెక్కించిన మేర్లపాక గాంధీ, మరోసారి తన మార్క్ కామెడీని ఈ చిత్రంలో చూపించినట్లు సమాచారం. సినిమా తొలి భాగం నుంచి రెండో భాగం వరకు పలు కామెడీ సన్నివేశాలు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తాయని సెన్సార్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా ఇంటర్వెల్ ముందు, తర్వాత వచ్చే ఎపిసోడ్లు బాగా వర్కవుట్ అయ్యాయని అంటున్నారు. అలాగే వరుణ్ తేజ్, సత్య మధ్య వచ్చే కామెడీ ట్రాక్‌తో పాటు బుల్లిరాజు పాత్ర చుట్టూ తిరిగే సన్నివేశాలు కూడా మంచి వినోదాన్ని అందిస్తాయని సమాచారం. కంటెంట్‌కు ప్రాధాన్యం ఇచ్చే వరుణ్ తేజ్ ఈసారి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌లో కూడా తన నటనతో ఆకట్టుకున్నారని సమాచారం. సినిమా కథ ఆసక్తికరమైన కాన్సెప్ట్‌తో రూపొందినట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని కియా కంపెనీలో ఉద్యోగం కోసం కొరియా నుంచి వచ్చిన యువతి పాత్రలో రితికా నాయక్ కనిపించనుంది. ఆమెను ప్రేమించే కనకరాజు జీవితంలో అనుకోని మలుపు తిరుగుతుంది.కొరియా నుంచి వచ్చిన ఓ బాటిల్‌లో బంధించబడిన గ్యాంగ్‌స్టర్ ఆత్మ బయటకు వచ్చి కనకరాజును ఆవహిస్తుంది. ఆ తర్వాత కనకరాజు జీవితం ఎలా మారింది? ఆ ఆత్మ కొరియాతో ఉన్న సంబంధం ఏమిటి? చివరకు కథ ఎలాంటి మలుపు తిరిగింది? అనే అంశాల చుట్టూనే సినిమా సాగుతుందని తెలుస్తోంది. సినిమాకు సంగీత దర్శకుడు ఎస్. థమన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, పాటలు కథకు మరింత బలం చేకూర్చాయని సమాచారం. కామెడీ తర్వాత ఎక్కువ ప్రశంసలు సంగీతానికే వస్తాయని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది.




PUBLISHED AND OWNED BY DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJ-GIRI, TELANGANA - 500083.,EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com